KSR02B108 C
ENTERED

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఫిబ్రవరి 14, 2016

కథా నిలయం
శ్రీకాకుళం

నేను ఎవరిని ?





19 రోజులు 57 అంతస్తులు

రెడీమేడ్ భవనాలు

ప్రేమతో పెళ్ళి...

ప్రపంచంలోని ఎన్ని భాషలు చదవగలిగినా ఒకరి మనసు చదవడం... అందులోకి అడుగెట్టడం అంత తేలిక కాదు. అలా ప్రవేశించి హృదయమనే పద్మవ్యూహాన్ని ఛేదించి గెలుచుకోవడం సులభం కాదు. అలా మొదలెట్టిన ప్రణయ ప్రయాణంతో పండంటి కాపురానికి బాటలు వేసుకోవటం కొందరికే సాధ్యం. ఈ ప్రేమ ఎవరి మదిలో ఎప్పుడు ఎలా పుడుతుందో ఎవ్వరూ చెప్పలేరు. హిట్ పెయిర్‌గా నిలిచి .. యాక్టింగ్ కింగ్‌గా, క్వీన్ గా పేరు తెచ్చుకునే సినీ స్టార్లూ అందుకు మినహాయింపు కాదు. అయితే కాలం పెట్టే పరీక్షలకు నిలబడ్డ జంటల లవ్ జర్నీ కొత్త మలుపు తీసుకుని పెళ్లి పీటల వరకూ వెళుతుంది. అలా సహ నటులుగా మొదలైన పరిచయం... స్నేహితులుగా...ఆ తర్వాత ఇష్ట సఖులుగా... జీవిత సహచరులుగా మారిన బాలీవుడ్, టాలీవుడ్ నటుల జాబితా చాలా పెద్దదే. సంతోషకరమైన జీవితాన్ని గడుపుతున్న ఈ సినీ 'లవ్ బర్డ్స్' వాలంటైన్స్‌డేను స్పెషల్‌గా జరుపుకోనున్నారు.

ENTERED
కథా నిలయం KSR02B108
శ్రీకాకుళం

మార్గదర్శి



కచ్చితమైన కలెక్టర్

తమిళనాడులో ఓ ఐఎఎస్ అధికారి.

ప్రస్తుత పోస్ట్ - కలెక్టర్.

పలు ప్రభుత్వ బాధ్యతలు నిర్వర్తించిన కాలం- సుమారుగా 20 సంవత్సరాలు.

ఈ మధ్య కాలంలో వచ్చిన బదిలీలు- 20

రాజకీయ నాయకులు, వారి తొత్తుల నుంచి వచ్చిన బెదిరింపులు, హెచ్చరికలు - చాలానే.

నమ్మే .. ఆచరించే సిద్ధాంతం- లంచం తిరస్కరించు...తల ఎత్తుకుని జీవించు.

ఈ వివరాలన్నీ మరెవరివో కావు. పేద ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకున్న ఐఏఎస్ అధికారి యు. సగాయంవి.

నిజాయితీపరుడైన అధికారిగా ఆయన గురించి తప్పక తెలుసుకోవాల్సిన విశేషాలు...

నాన్న చిరు వ్యవసాయదారుడు. అమ్మ గృహిణి. కొద్ది పాటి పొలం. ఐదుగురు అన్నదమ్ముల నడుమ పుట్టాడు సగాయం. అప్పుడు చిన్నారి సగాయానికి పదేళ్లుంటాయేమో. నేస్తాలతో కలిసి తమ పొలం పక్కనే వున్న మామిడి చెట్ల కింద రాలిన కాయలు ఏరుకుని ఇంటికి తీసుకెళ్లాడు. వాటిని చూసిన తల్లి వెంటనే వాటిని పారేయమంది. పసివాడైన సగాయానికి ఆ పుల్లమామిళ్లను విసిరేయడానికి మనస్కరించలేదు. తటపటాయిస్తుండగా... 'నీవి కాని వాటిని తినకూడదు. పడేసేయ్' అని చెప్పి బలవంతంగా పడేయించింది. ఆ తర్వాత ఓసారి తమ పొలం పక్కనే ఒక ఎకరం పోరంబోకు భూమి సాగు చేయకుండా వదిలేయడాన్ని గమనించి తల్లిని కారణం అడిగాడు. మనది కానప్పుడు సాగు ఎలా చేస్తాం అందామె. ఆ రెండు సందర్భాల్లో జరిగిన సంభాషణ ఆ పసి మనసుపై చక్కటి ముద్ర వేసింది. తనది కానిదాన్ని తాకకూడదని నిర్ణయించుకున్నాడానాడే. అలా సగాయం నిజాయితీపరుడిగా మారడానికి బీజాలు చిన్నవయసులోనే పడ్డాయి.

- 1991లో ఐఎఎస్ పూర్తి చేసుకున్న సగాయం ఊటీ సబ్‌డివిజనల్ మెజిస్ట్రేట్‌గా నియమితులయ్యారు. తన గదిలోకి అడుగెట్టగానే 'లంచం తిరస్కరించు...తల ఎత్తుకుని జీవించు...' అన్న సైన్ బోర్డు కనిపిస్తుంది. తను నమ్మే ఆ మాటకు కట్టుబడి జీవించడం మామూలు విషయం కాదు. అది తోటి ఉద్యోగుల్లోను, బయట రాజకీయ నాయకుల్లోను ఎందరో శత్రువులను సృష్టిస్తుంది. అయినా సరే వెనకడుగు వేసిందే లేదు. ఉద్యోగంలో చేరిన మొదటి రోజు నుంచి ఇప్పటి వరకు దానికే కట్టుబడి పనిచేస్తున్నారు. 2000 సంవత్సరంలో జరిగిందీ ఘటన. చెన్నై సమీపానున్న పెప్సీ కోలా బాట్లింగ్ యూనిట్‌లో సీసాల అడుగున మట్టి పేరుకుపోవడాన్ని గమనించి మిన్నకుండలేకపోయారు. అప్పట్లో కాంచీపురం అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్‌గా వున్నారు. బయటి నుంచి వచ్చిన ఒత్తిళ్లకు అదరక బెదరక ఆ కంపెనీని మూసివేశారు.
- 2004 నాటి మాట. అప్పట్లో సగాయం చెన్నై పౌరసరఫరాల డిప్యూటీ కమిషనర్‌గా వున్నారు. ఇళ్లలో వాడుకోవాల్సిన సబ్సిడీ సిలిండర్లను పెద్ద ఎత్తున రెస్టారెంట్లలో వాణిజ్య పరమైన ప్రయోజనాలకు ఉపయోగించడాన్ని గమనించారు. దానివల్ల ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లు తుందని మూడు రోజుల్లో 5 వేల సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.
- 2009లో సగాయం ఒక రికార్డు సృష్టించారనుకోవాలి. తన ఆస్తిపాస్తుల వివరాలను జిల్లా వెబ్ సైట్‌లో వుంచిన తొలి ఐఏఎస్ అధికారిగా అభినందనలు అందుకున్నారు. ఆ వివరాల ప్రకారం ఆయన వ్యక్తిగత బ్యాంకు బ్యాలెన్స్ రు. 7172. మధురైలోని వారి ఇంటి విలువ రు. 9 లక్షలు.
- 2011లో మధురైలో జరిగిన ఎన్నికల పర్యవేక్షణకు ఎలక్షన్ కమిషన్ ఏరికోరి సగాయాన్ని నియమించింది. ఎన్నికల ప్రక్రియ మరో 20 రోజుల్లో ప్రారంభమౌతుందనగా... ఓటర్లకు అవగాహన కల్పించేందుకుగాను సగాయం ఒక ప్రచారోద్యమం చేపట్టారు. ఓటు వేసేందుకు గాను ఇవ్వజూపే డబ్బును నిర్ద్వంద్వంగా తిరస్కరించమని చెప్పారు. అంతేకాక ఓట్లు కొనుగోళ్లకు, ఓటర్లకు పంచేందుకు ఉద్దేశించిన 20 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. స్వేచ్ఛగా ఎన్నికలు జరిగేందుకు చేసిన కృషికి గాను ఎన్నికల సంఘం సత్కరించింది.
- మధురైలో జరుగుతున్న అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వ ఖజానాకు 16,000 కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోందని 13 పేజీల నివేదికను తమిళనాడు ప్రభుత్వానికి అందించారు. ఇది 2012లో జరిగింది.
- 2015లో ఓ కేసుకు సంబంధించిన సాక్ష్యాలను కాపాడేందుకు శ్మశాన వాటికలోనే పాగా వేసి కామన్‌మేన్ హీరో అయ్యారు. గ్రానైట్ స్కామ్‌కు సంబంధించి విచారించేందుకుగాను తమిళనాడు హైకోర్టు సగాయాన్ని నియమించింది. గ్రానైట్ గని నిర్వాహకులు ఓ వ్యక్తిని బలి ఇవ్వడానికి సంబంధించిన కేసు సాక్ష్యాలను కాపాడేందుకే అలా చేయాల్సి వచ్చింది.
- నమక్కళ్‌లో విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ (విఎఒ) వ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చేందుకు సగాయం ఎంతగానో ప్రయత్నించారు. విఎఒలు తాము పనిచేసే గ్రామాల్లో నివసించేవారు కాదు. సగాయం ప్రయత్నాల ఫలితంగా వారు కచ్చితంగా ఆయా గ్రామాలకు రావాల్సి వచ్చింది. దాంతో స్థానిక నేతల సాయంతో సగాయంను బదిలీ చేయించాలని చూశారు. అయితే ఈ విషయం తెలిసి 5 వేల మంది గ్రామస్తులు బదిలీని ఆపాల్సిందిగా ప్రదర్శనలు, నిరసనలు తెలిపారు. అలా కచ్చితమైన కలెక్టర్‌గా పేరు పొందాడు యు.సగాయం.

✦

ఇండెక్స్

స్టార్.................. 3
నేను ఎవరిని?
యువ.................. 4
లవ్ కమెండోలు
కార్టూన్ పంచ్......... 5
స్ఫూర్తి................10
కంటిపాప చిత్రం
తెలుసా................11
నా కళ్ళతో..............14
కత్తెరల యాత్రలు

19 రోజులు..
57 అంతస్తులు...
రెడీమేడ్ భవనాలు



అట్టమీది కథ.........6

జీవితం....12
పరివర్తన సమాజంలో కూడా..

వింతలోకం..............16
కలలాంటి ప్రేమ పెళ్లి
కొత్త పుస్తకాలు...........17
మనసు పాటల పుస్తకం
కథ...................18
మాతృదేవోభవ
రుచి.....................21
మామిడి, రొయ్యల పచ్చడి
బాలనేస్తాలు..............22
ఫింగర్ పపెట్
పద వికాసం............24

అద్భుత విన్యాసాలు

కవర్ స్టోరీ చదువుతుంటే ... విశాఖ ఐఎఫ్ఆర్ కార్యక్రమాల విన్యాసాలన్నీ కళ్ళెదుట జరుగుతున్నట్లు అనిపించింది. ముంబై అమ్మాయి 'గార్గి' పాములతో ఆడుకోవడం విస్మయపర్చింది. కాంచనమాల పరిచయం. ఆమె సినీ కెరియర్ ఆసక్తిగా చదివించింది. చివర్లో కోర్టు కేసులు చుట్టుముట్టడం... కొందరామెను పిచ్చిదానిగా ప్రచారం చెయ్యడం బాధించింది. నాట్యం, నటన, సంగీతం స్పోర్ట్స్ వంటి వివిధ రంగాల్లో సూపర్‌గా దూసుకుపోతున్న పలువురు సిస్టర్స్ ప్రతిభ శాశ్వతంగా నిలిచిపోతుంది.

టి. సత్యనారాయణ మూర్తి, వైజాగ్

చాలా తెలిశాయి

మహానటి కాంచన మాల గురించి తెలిసినా ఆమెకు జెమినీ వాసన్ కోర్టు వివాదాన్ని, మానసికంగా కృంగిపోయి తెర మరుగు అయిన విధానాన్ని చక్కగా వివరించారు. పక్షుల గురించి తెలియని ఎన్నో విషయాలను తెలియజేసినందుకు చాలా సంతోషంగా వుంది.

పి. సీతారామరాజు, కాకినాడ

పాములతో దోస్తీ

సాధారణంగా పాముల్ని చూస్తే ఆమడ దూరం పారిపోయే నేటి జనం గార్గిని చూసి ఎంతైనా నేర్చుకోవాలి. 'హిమ సీమల్లో కోహిమం' వ్యాసం చాలా బాగుంది. హిమాలయాల్లో తేలినంతటి అనుభవాన్ని కల్గించారు. వ్యాపార విస్తృతి కోసం కొత్త పుంతలు తొక్కుతున్నారనే విషయాన్ని వింత లోకంలో మరోసారి నిరూపించారు.

రామకోటి, మార్కాపురం

సాగర విన్యాసాలు

విశాఖ తీరంలో నావికా దళ విన్యాసాలు అబ్బురపరిచాయి. దేశ ప్రతిష్టకు వన్నె తెచ్చేలా ఫ్లీట్ రివ్యూ జరిగింది. 52 దేశాలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం నిజంగా ఆనందించదగ్గ విషయం. ప్రపంచ నలుదేశాలతో స్నేహ సంబంధాలు మెరుగుపరుచుకోవడం చాలా బాగుంది. అభివృద్ధి వైపు పయనిస్తోందని చెప్పడానికి ఇది ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. మారుతున్న సమాజంలో నేటికి అనుబంధాలు, ఆప్యాయతలు బలంగా ఉన్నాయనడానికి ఈ సూపర్ సిస్టర్స్ మిగిలిపోతారు.

రాము, కడప

మరుపురాని క్షణాలు

కాంచన నేటికీ, నాటికీ మరుపురాని నటి. సినీ జీవితంలో చివరి మజిలీ వరకు తను పోరాడుతూనే ఉంది. చివరి క్షణంలో తన మీద వచ్చిన వదంతులు, కోర్టు కేసుల్లో చిక్కుకుపోవడం వంటివి తనను ఎంతగానో బాధపెట్టాయి. ఆ చివరి క్షణాలను కళ్లకు కట్టినట్టు వివరించిన రచయితకు ధన్యవాదాలు. చదువు, సంస్కారం, వినయం, విధేయత వంటివి ఉంటే జీవితంలో ఎదగవచ్చు అనేవి అలనాటి సామెతలు, నేడు మన హీరోయిన్లు తమ అందచందాలతో అందలాల్ని అందుకుంటున్నారు. పక్షుల గురించి తెలియని విషయాలను చాలా చక్కగా వివరించారు. ఈ వారం కార్టూన్ పంచ్ బాగుంది. నేటి యూనివర్శిటీలో జరుగుతున్న కుల రాజకీయాల మీద కార్టూన్ బాగుంది.

మణికంఠ, చిత్తూరు

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

స్టార్

కమల్ హాసన్ ఎవరు? అనే ప్రశ్నకు చాలా పదాలే ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. నటుడు, దర్శకుడు, నృత్యకారుడు, రచయిత, నిర్మాత వరకు ఆయన రాసుకున్నాడు. కానీ గాయకుడిగా, సంగీతకారుడిగా, కవిగా ఆయన సృజనాత్మకతకు ఫుల్‌స్టాప్ అంటూ పెట్టలేం. కమల్‌లో మరో ప్రత్యేకత కూడా ఉంది. అతడో మనిషి పరిశోధకుడు. మానవత ప్రచారకుడు. మతం, సిద్ధాంతంపై స్పష్టంగా, ధైర్యంగా అభిప్రాయాలు చెబుతాడు. కొన్నిరోజుల క్రితమే హార్వర్డ్ విశ్వవిద్యాలయ వేదికపై 'ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్'పై సూటిగా మాట్లాడిన కమల్ సామాజిక మాధ్యమాల్లోను నిశ్శబ్దంగా తానెవరో ఓ మాట చెబుతున్నాడు.

నేను ఎవరిని ?



కమల్ ఆరాధించే 'మనిషికి కూడా తన రైట్స్ ఇచ్చేయలేదు. ఆ మనిషికన్నా ముందున్న విషయాల్ని కూడా పరిగణనలోకి తీసుకున్నాడు. అందుకే మతం, కులం, ప్రాంతం, వర్ణం ఇవన్నీ కమల్‌కు అంటలేదు. ఎందుకంటే మనిషి పుట్టాకే ఇవన్నీ బుర్రలో పుట్టాయి కాబట్టి. కమల్ ఓ సైంటిఫిక్ మానవతావాది. అప్పుడప్పుడూ వింటూంటాం.. 'మీరెవరు?' అని అడిగితే వేళాకోళంగా 'నేను మనిషిని' అనేవాళ్లుంటారు, 'మనిషిని నేను' అని సీరియస్‌గా దృక్పథాన్ని చెప్పేవాళ్లుంటారు. ఆటపట్టించే వాళ్లు తాము మిగతా జంతువుల నుంచి వేరంటారు. సీరియస్‌గా తీసుకునేవాళ్లు తాము కులాలకు, మతాలకు అతీతమన్న అర్థంలో గట్టిగా చెబుతారు. ఇదే విషయాన్ని కమల్‌ను అడిగితే బహుశా సమాధానం వేరేలా ఉంటుందేమో. అడక్కుండానే తానేంటో స్పష్టత ఇచ్చేశారు కూడా. అదేంటంటే కమల్ ఒక 'డెనిసోవన్ నియాండెర్తల్ జీన్ పూల్ మిక్స్' వారసుడు. ఇదంతా కూడా పరిహాసానికో, ట్రివియల్‌గానో సాగే సంభాషణకు వాడలేదు. ఇప్పుడు ప్రపంచంలో ఎటు చూస్తున్నా కనిపించే మత, జాతి వైరాలు, విధ్వంసాలు, జీవహింస, పర్యావరణ హననం. వీటికి రెస్పాన్సే కమల్ మాట. ఇదెక్కడ వాడాడనేది ఓ సారి కమల్ ట్విట్టర్ ఖాతా పేజీ తెరిస్తే తెలుస్తుంది. బ్యాక్‌గ్రౌండ్ ఇమేజ్‌లో తన రెండు కళ్లతో లోతుగా పరిశీలిస్తున్నట్టు చిత్రం. ఆ ఇమేజ్ మీద స్పష్టంగా ఉన్న మాటే ఈ 'డెనిసోవన్......'. దీనికి అర్థం ఆ అంతర్జాతీయ నటుడి లోతైన చూపంత నిశితంగా, తీవ్రంగా ఉంటుంది.

డెనిసోవన్ అనేది సైబీరియాలోని అల్టై పర్వతాల్లో ఉన్న లక్షల ఏళ్ల నాటి గుహ. అక్కడే నేటి మానవుడి పూర్వీకులు నియాండెర్తల్, హోమోసేపియన్ అల్టాయ్ తొలి మానవుల అవశేషాలు లభ్యమయ్యాయి. 2008లో అక్కడ 40 వేల ఏళ్ల కిందటి ఓ మానవ దంతం, 5-7 ఏళ్ల మధ్య వయసున్న పాప ఎముక లభ్యమయ్యాయి. వాటిపై పరిశోధనలు చేస్తే అవి మరో జాతికి చెందినవారివని తేలింది. లభ్యమైన గుహ పేరిటే ఆ జాతికి డెనిసోవన్‌లు అని పేరు పెట్టారు. ఈ జాతులన్నిటి కలయికే ఆధునిక మానవుడు. అదే కమల్ తనెవరో రాసుకున్న మాట. ఇది విశ్వ మానవుడి కంటే మరింత లోతైన, పదునైన మాట. కొందరు వాదించొచ్చు వీరందరి కంటే ముందు హోమో హైడెల్‌బెర్గర్ జాతి ఉందని, దాని కంటే ముందు మనిషి కోతి నుంచి వచ్చాడని ఇలా ఇలా వెనక్కు తీసుకెళ్లి ఈ మంచి మాటను అవహేళన చేయొచ్చు. కానీ, సరిగ్గా కమల్ చెప్పుకున్న జాతుల కలయికప్పుడే మనిషి మెదడు, నాడీ వ్యవస్థ పని తీరులో గొప్ప అభివృద్ధి జరిగింది. జన్యువుల్లో మార్పులు భాషను పటిష్టం చేశాయి. అంటే మనిషి మనిషిలా ఆలోచించే దశకు నాంది. ఆ జాతులన్నీ అంతర్ధానమైనా తొలి ఆధునిక మానవ జాతి మనగలిగిందంటే ఆ జీన్ పూల్ మిక్స్ అందించిన అడ్వాంటేజే. అందుకే సైంటిఫిక్ కమల్ అయ్యాడు.

నాస్తికత్వమే ఆస్తా?

కమల్ నాస్తికుడా? మతోన్మాద ప్రపంచంలో శాంతి కోసం ఉపయోగపడేలా నాస్తికత్వాన్ని పరికరంగా వాడుతున్నానని ఓ సందర్భంలో చెప్పాడు. కూతురిలిద్దరి జనన పత్రాల్లో మతం కేటగిరీనీ ఖాళీ చేసి వాళ్లకి స్వేచ్ఛను కల్పించాడు. తనకు మతం లేదని కానీ వాటిలో మంచి జీవనానికి, అందరి మధ్య సామరస్యాన్ని కలిగించే మాటలు, విషయాలుంటే వాటిని వాడటంలో సిగ్గుపడనని అంటాడు. హైస్కూల్ డ్రాపౌట్ అయిన కమల్ ఈ మధ్యే విద్యా దురంధరుల హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రసంగించాడు. అదీ మాట్లాడే స్వేచ్ఛ గురించి. దేశ గణతంత్ర దినోత్సవ సందర్భంగా 'జన గణ మన..' గీతంతో ట్విట్టర్ ఖాతాను ప్రారంభించి దేశభక్తిని చాటుకున్న కమల్ ఫాసిస్ట్ భావనల్ని ఆ వేదికపై ఎండగట్టాడు. మరో మాట ముందుకేసి ప్రజాస్వామ్యం దగ్గర నుంచి మిగతా ఏ ఇజాలు కూడా పరిపూర్ణమైనవి కావంటాడు. ప్రజాస్వామ్య వ్యవస్థ నుంచే నాజీ నియంతగా హిట్లర్ పుట్టాడని, మనదేశంలో ఎమర్జెన్సీ స్వేచ్ఛకు సంకెళ్లేసిందని కుండబద్దలు కొట్టాడు. శతాబ్దాల నాటి ప్రజాస్వామ్య దేశం అమెరికా కంటే... ఆ వ్యవస్థ శైశవ దశలో ఉన్న భారత్ .... తలమానికమైన 'అందరికీ ఓటు హక్కు'ను 15 ఏళ్ల ముందే కల్పించిందని అక్కడి లోపాల్ని పట్టి చూపించాడు. మార్టిన్ లూథర్ కింగ్ రక్తమే అమెరికా అభ్యుదయ ప్రజాస్వామ్యానికి సిరాగా మారిందని తడుముకోకుండా చెప్పాడు. పది వేల ఏళ్లుగా చేస్తున్న ప్రయోగాల్లో భాగంగానే ఇప్పటి ఇజాలు రూపుదిద్దుకున్నాయి కానీ ఇవే ప్రపంచ సమస్యలకు పక్కా పరిష్కారం కాదని అన్నాడు. మాట్లాడే స్వేచ్ఛ హక్కే కానీ మాట్లాడే ముందు స్పృహతో ఉండాలంటాడు. బాధ్యతతో మాటలుండాలే గానీ కించపరిచేలా దాడి చేయకూడదనేది తన మాటగా చెప్పాడు.

-జే



రోమియో జూలియెట్ ఎందుకు ప్రాణాలు తీసుకున్నారు? దేవదాస్ పారు ఎలా దూరమయ్యారు? లైలా మజ్నుల చావుకు కారణమేంటి? విషాద గాథలు చదవడానికే బాగుంటాయి. అవి మనకు జరిగితే? ప్రేమ కథల్లోని విషాదాంతాలే గుండెల్ని పిండేస్తే నిజ జీవితంలో ఇలాంటి హసీనా, సిపాయ్‌లెందరి కథలో కన్నవాళ్ల వల్లే కరిగిపోతున్నాయి. ఇరు మనసుల కథ ఎందుకు పదుగురి విషయంగా మారి పరువు హత్యల విషాద గాథగా మారుతుందో? కులం అంటూ, మతం అంటూ, స్థాయి అంటూ కన్నబిడ్డల జీవితాల్ని ఎలా తుడిచేయగలుగుతారో? చిరు హృదయాల చిగురు ప్రేమలు ఇలా వాడిపోకుండా లవ్ కమాండోస్ రక్షణనిస్తున్నారు. ప్రేమ జంటల పెళ్లి కష్టాలకు శుభం కార్డు వేస్తున్నారు.

లవ్ కమెండోలు



కొన్ని చదివేసి, కొన్ని తగిలించేస్తే భార్యభర్తలైపోతారా? మనసు, ప్రేమకు పెళ్లిలో చోటు లేదా? అది ఉంటే కనుక పెద్దలు ఈడుజోడు, కులం గోత్రం, చదువు సంధ్య, అందం చందం లెక్కలు వేసి కుదిర్చే పెళ్లిళ్లు బలవంతపు పెళ్లిళ్లు కాక మరేంటని నిలదీస్తాడు సంజయ్ సచ్‌దేవ్. 18 ఏళ్ల కుర్రాడు ఈ దేశ ప్రధానిని ఎన్నుకునే పరిణతి కలిగిన వాడైతే మరి జీవిత భాగస్వామిని ఎంచుకునేంత పరిపక్వత అతడికుండదా అని ప్రశ్నిస్తాడు. ఒక్క క్షణమైనా కలిసి బతికితే చాలనుకునే ప్రేమికుల హృదయాల్ని అర్థం చేసుకోకుండా పరువు పేరిట వేటాడుతున్న వారిని ఎదిరిస్తాడు. ప్రేమకు పట్టం కట్టి చట్టబద్ధంగా వివాహ బంధాన్ని అందించేందుకు ప్రాణాల్ని లెక్క చేయకుండా పోరాడుతున్న లవ్ కమెండోస్‌కు ఆయన సారథి. ఢిల్లీ నుంచి దేశంలోని పలు ప్రాంతాల వరకు ఈ కమెండోలున్నారు. వీరంతా దేహదారుఢ్యులు కాదు కానీ వీరి మనో బలానికి ఖాప్ పంచాయతీల ఆదేశాలు, ఫత్వాలు కొట్టుకు పోవాల్సిందే. వీరి దగ్గర మారణాయుధా లుండవు. కానీ ప్రేమనే సంధిస్తూ యువ జంటల అడ్డుగోడల్ని కూల్చేస్తున్నారు. లవ్ కమెండోలు ఒకరు ఇద్దరు కాదు. లక్షల సంఖ్యలో ఉన్నారు. అదీ జర్నలిస్టుల రూపంలో.. మానవ హక్కుల కార్యకర్తల రూపంలో.. న్యాయవాదుల రూపంలో.

ప్రేమికులు తమ కుటుంబాన్ని ఒప్పించడంలో విఫలమైతే జరిగేవి ఆత్మహత్యలో లేదా దూరంగా వెళ్లిపోవడాలో. లవ్ కమెండోస్ సహా వ్యవస్థా పకుడు హర్ష్ మల్హోత్రాది అదే పరిస్థితి. ట్రావెల్ ఏజెంట్ అయిన హర్ష్ తన ప్రియురాలి ఇంటి పెద్దల్ని ఒప్పించేందుకు వెళితే వాళ్లు దాడి చేశారు. గత్యంతరం లేక ఆమెతో కలిసి ఆ ఊరు నుంచి రహస్య ప్రాంతానికి వెళ్లిపోయాడు. కానీ ప్రాణ భయం, ఎలా తమ బంధాన్ని చట్ట బద్ధం చేసుకోవాలి, ఎలా నిలదొక్కుకోవాలో తెలీదు. గూడు కోసమే చాలా తిప్పలు పడ్డారు. అందమైన జీవి తాన్ని అందిస్తానని మాటిచ్చి ఇలా ఇబ్బందులు పాలు చేస్తున్నానేమిటని బాధపడ్డాడు. ఇలాంటి పరిస్థితి మరే జంటకు కలగకూడదని ఆయన సచ్‌దేవ్‌తో కలిసి లవ్ కమెండోస్‌ను ప్రారంభించాడు. లవ్ కమెండోస్‌కు మరో కారణం కూడా ఉంది. 2010లో ఓ ప్రేమ జంటను విడదీసేందుకు ప్రేమికుడి మీద అత్యాచారం కేసు పెట్టారు అమ్మాయి పెద్దలు. ఆమె మైనర్ అని తప్పుడు కేసు బనాయించి వేరు చేయాలని కుట్ర పన్నారు. దీని మీదే సచ్‌దేవ్ స్పందించారు.

అలా మొదలై పూర్తిస్థాయిలో కేవలం ప్రేమకే అంకితమై నడుస్తోన్న లవ్ కమెండోస్ గురించి తెలిసి దాని దళం పెరిగిపోయింది. లక్షల సంఖ్యలో ప్రేమ మిత్రులు చేతులు కలిపి హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ వంటి చోట్ల పెద్ద ఎత్తున కార్యకలాపాలు ప్రారంభించారు. ఇప్పటి వరకు 40 వేలకు పైగా ప్రేమ జంటల్ని కాపాడమని చెబుతున్న సచ్‌దేవ్ ఒక్క ప్రేమ మాత్రమే నిలుస్తుందని దాని ముందు ఈ కులాలు, మతాలు, స్థాయిలన్నీ కొట్టుకుపోతాయని గట్టిగా చెబుతారు. తమ వెబ్‌సైట్ లవ్ కమెండోస్‌లో వారిని సంప్రదిం చాల్సిన ఫోన్ నంబర్లు ఉంచారు. వాటి ద్వారా నిరంతరం ప్రేమికులకు అందుబాటులో ఉంటూ అవసరమైన పక్షంలో ఆ జంటలకు రహస్య స్థావరాల్లో ప్రభుత్వం అండతో వసతి ఏర్పాటు చేసి పెళ్లిళ్లు చేస్తారు. కుదురుకునేంత వరకు, ప్రాణ హాని తప్పేంత వరకు, లేదా పెద్దలు వారి వివాహాన్ని అంగీకరించేంత వరకు ఉచితంగా తిండి, వసతి మిగతా ఎమెర్జెన్సీలు అందిస్తారు. వీరి సాయం పొందాలంటే ప్రేమికులు మైనర్లు కారని వారి జనన ధృవీకరణ పత్రాలు, చిరునామా ప్రూఫ్‌లు అందించాలి. చాలా చోట్ల గృహ నిర్బంధ చిక్కులుంటాయి. వీటిని స్వయంగా లవ్ కమెండోస్ టీమే వెళ్లి ఛేదిస్తుంది. నిర్బంధంలో ఉన్న అమ్మాయిని గానీ అబ్బాయి గానీ విడిపించి వారి సమ్మతితో వివాహం జరిపిస్తుంది. ప్రేమికుల హక్కులు, వివాహ నియమ నిబంధనల్లో మార్పులపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు కూడా లేఖ రాశారు లవ్ కమెండోస్. అమీర్ ఖాన్ నడిపించిన 'సత్యమేవ జయతే' కార్యక్రమంలో కూడా లవ్ కమెండోస్ పాల్గొన్నారు. వీరి పోరాటంలో కొందరు సమిధలు కూడా అయ్యారు. ప్రేమికుల రక్షణకు పని చేస్తున్న ఒకే ఒక జాతీయ స్వచ్ఛంద సంస్థ బహుశా ఇదొక్కటే కావొచ్చు. అందుకే మతోన్మాదులు, పెద్దల పంచాయతీలు వీరిని హతమార్చేందుకు ఎన్నో దాడులు చేస్తున్నాయి. కానీ తెలుసుకోంది ఏంటంటే ప్రేమ పర్వతాన్నైనా ఢీకొట్టే బలాన్నిస్తుంది. మరణంతోనైనా పోరాడే తెగింపునిస్తుంది. లవ్ కమెండోస్ కృషిని తెలుసుకున్న బెల్జియన్ ఫొటోగ్రాఫర్ మ్యాక్స్ పింకాస్ ఓ ఫొటోబుక్ రూపొందించాడు. దానికి ఫొటోగ్రాఫిక్ మ్యూజియం ఆఫ్ హ్యూమానిటీ చాంపియన్‌షిప్ అవార్డు దక్కింది. ఆ ఫొటోబుక్ పేరు 'విల్ దే సింగ్ లైక్ రెయిన్ డ్రాప్స్ ఆర్ లీవ్ మి థర్స్టీ' (వారి వివాహం సందడి చేస్తుందా, లేదా వాళ్లు కలవాలనే నా దాహం తీరదా). ✦



కార్టూన్ పంచ్

నవ్వుల్- పువ్వుల్

గులాబిజామ్

కిరణ్: ఏంట్రా! గులాబి, జామ మొక్కల్ని నాటుతున్నావ్..

సుబ్బు: రెండు కలిపి నాటితే పెద్దదయ్యాక గులాబ్ జామ్‌లు కాస్తాయని..!

తాడు

భార్య: మీ పిసినారి తనం రోజు రోజుకు భరించలేకపోతున్నాను. ఉరివేసుకొని చచ్చిపోతా!

భర్త: ఉరితాడు కొనకు! పైన అటకపై పాత తాడు ఉంది!

కొంటె ప్రశ్నలు

ఎవర్నీ మాట్లాడనీయకుండా తనక్కొడే మాట్లాడే వాళ్ళను ఏమంటారు

టీచర్

అందరు ఇష్టపడే ఆర్డర్

మనీ ఆర్డర్

టీవీ పిచ్చోడి కల

తనకు వచ్చే కల మధ్యలో అడ్వర్‌టైజ్‌మెంట్లు రావడం.

డొక్కు కారు

(ఓ సందర్భంలో రెండు దేశాల రైతులు కలుసుకున్నారు)

అమెరికా రైతు: మీ పొలం విస్తీర్ణం ఎంత? అని అడిగాడు భారత రైతుని..

భారత రైతు: నాకు రెండు ఎకరాలు ఉంది. అందులోనే అన్ని రకాలు సాగు చేస్తాను. ఇంతకి మీకు ఎంతుంటుంది.? ఎదురు ప్రశ్నించాడు..

అమెరికా రైతు: అదా...నేను పొద్దున ఈ చివరి నుంచి కార్లో బయలుదేరితే మధ్యాహ్నానికి గానీ అటువైపు చేరుకోను గర్వంగా చెప్పాడు.

భారత రైతు: నాకు కూడా అలాంటి డొక్కు కారే ఉంటే ఈ మధ్యే అమ్మేశాను....



ఇల్లు కట్టిచూడు... పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. ఈ రోజుల్లో ఇల్లు కట్టాలంటే మామూలు విషయం కాదు. నెలలు... సంవత్సరాలు పట్టాల్సిందే. పిల్లర్లు వేయాలి, వాటిని బాగా తడపాలి, ఆ తర్వాత స్లాబు వేయాలి... దీనికి చాలా సమయం పడుతుంది. అయితే ఇదంతా నిన్నటి మాట...! ఇప్పుడు ప్రపంచం మారుతోంది. అందివచ్చిన సాంకేతిక పరిజ్ఞానం రెడీమేడ్ ఇళ్లనే అందిస్తోంది. కేవలం రెండు నుంచి 19 రోజుల్లోనే ఇంటి నిర్మాణం పూర్తవుతుందంటే అతిశయోక్తి కాదు. ఈ తరహా నిర్మాణాలు విదేశాల్లో జరుగుతున్నాయి. చైనాలో 19 రోజుల్లో... 57 అంతస్థుల భవనాన్ని నిర్మించి రికార్డు సృష్టిస్తే, మనదేశంలో 48 గంటల్లోనే 10 అంతస్థుల భవనం నిర్మించి శెభాష్ అనిపించారు. ప్రస్తుతం మన దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఈ తరహా నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి.

19 రోజులు... 57 అంతస్తులు

రెడీమేడ్ భవనాలు



చైనాలో నిర్మించిన 57 అంతస్తుల భవనం ఇదే

ప్రస్తుతమున్న ఇళ్ల కొరతను అధిగమించాలంటే.. నిర్మాణాల్ని వేగవంతంగా పూర్తి చేయగలగాలి. అందుకోసం, ఆధునిక పరిజ్ఞానంపై దృష్టి పెట్టాలి. సంప్రదాయ పద్ధతిలో ఇళ్లను కడితే.. అనుకున్న సమయానికి పూర్తిచేయడం సాధ్యం కాదు. ఇందుకోసం, ప్రీ-ఫ్యాబికేటెడ్ టెక్నాలజీని ఉపయోగించడం అన్ని విధాలా ఉత్తమం. అప్పుడే ఇళ్ల నిర్మాణంలో వేగం, నాణ్యత పెరగడంతో పాటు ఖర్చు కూడా తగ్గుతుంది. అంతేకాకుండా ఈ కట్టడాలు పర్యావరణానికీ అనుకూలంగా ఉంటాయి. పైగా భూగర్భజలాలు తగ్గుతోన్న ప్రస్తుత నేపథ్యంలో మంచినీరు కూడా ఆదా అవుతుందని నిపుణులు చెబుతున్నారు.

ప్రీఫ్యాబికేటెడ్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఇళ్లకు పిల్లర్లు, బీములు, పైకప్పు ముందుగానే నిర్మిస్తారు.



వాటిని తరువాత జాయింట్ చేస్తారు. గతంలో ఒకదాని తరవాత మరో 'శ్లాబు' వేయడానికి 18-20 రోజులు పట్టేది. నేడు ప్రీ ఫ్యాబికేటెడ్ భాగాలు, మాడ్యులర్ స్ట్రక్చర్ల రంగప్రవేశంతో ఆ పని ఏడెనిమిది రోజుల్లోనే పూర్తవుతోంది. చైనాలో భారీ నిర్మాణాల టెక్నాలజీ బాగా పెరిగింది. 30 అంతస్థుల భవన నిర్మాణానికి ఎన్నేళ్లు పడుతుందని మనం ఆలోచిస్తుంటే.. వాళ్లు రోజుల్లోనే చేసేస్తున్నారు. ప్రీ ఫ్యాబికేటెడ్ టెక్నాలజీని విస్తృతంగా వినియోగించడం ద్వారా నిర్మాణ వ్యవధిని బాగా తగ్గించగలిగారు. అయితే సంప్రదాయ నిర్మాణాలకు అలవాటు పడిన ప్రజలకు, ఈ తరహా ఇళ్ల నిర్మాణంపై అనేక అనుమానాలున్నాయి. అలా జాయింట్ చేసిన ఇళ్లు పటిష్టంగా ఉంటాయా? అనేది ప్రధానమైన అనుమానం. విదేశాల్లో మాత్రం ఈ ప్రక్రియతో ఇళ్ల నిర్మాణం ఊపందుకుంటోంది. ముఖ్యంగా సింగపూర్, హాంకాంగ్, చైనా వంటి



దేశాల్లో ప్రీ క్యాస్ట్, ప్రీ ఫ్యాబ్ టెక్నాలజీల్లో ఇళ్ల నిర్మాణం వేగంగా దూసుకుపోతోంది.

రకరకాల రెడీమేడ్ ఇళ్లు

మనం ఇళ్ల గురించి మాట్లాడుతున్నప్పుడు ఎలాంటి ఇళ్లు కట్టించుకోవాలా అని సతమతమ వుతుంటాం. ఎన్నో రకాల ఇళ్లు కడుతుంటారు. వాటిలో ప్రీఫాబ్, మాడ్యులర్, ప్యానెల్ బిల్ట్, మానుఫ్యాక్చర్డ్ వంటి వేర్వేరు నిర్మాణాలు వున్నాయి.

ప్రీ ఫాబ్

ప్రీ ఫాబ్రికేటెడ్ గృహాలను క్లుప్తీకరించి ప్రీ ఫాబ్ గృహాలు అంటున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇంటికి కావాల్సిన నిర్మాణాన్ని ఫ్యాక్టరీలో తయారుచేసి, మనం ఇంటిని నిర్మించుకోవాలనుకున్న స్థలంలో అమర్చుతారు. దీన్నే ప్రీఫాబ్ అంటారు. ప్రీ ఫ్యాబ్రికేటెడ్ ఇళ్లను భవన నిర్మాణానికి అవసరమైన నిర్మాణ వస్తువులతో తయారుచేసి, ఇల్లు కట్టాలనుకున్న స్థలానికి చేరవేస్తారు. సాధారణంగా ఈ ప్రీ ఫ్యాబ్రికేటెడ్ ఇళ్ల నిర్మాణానికి అల్యూమినియం, స్టీల్, కలప, ఫైబర్ గ్లాస్, కాంక్రీట్‌ను ఉపయోగిస్తారు. మెటల్‌తో రూపొందించే గృహాలకు అల్యూమినియం-జింక్‌తో కూడిన పూతను వేస్తారు. ఇది తుప్పు పట్టడం, అగ్ని ప్రమాదాల నుండి రక్షిస్తుంది. అంతేకాకుండా భవనం పైకప్పు దృఢంగా వుండేందుకు కూడా ఉపయోగపడుతుంది. ఈ మెటల్ గృహాలకు ఉపయోగించే బీమ్స్, ఫ్రేమ్స్, గోడలు, పైకప్పు వంటి అన్ని భాగాలను స్టీల్‌తో తయారు చేస్తారు. ప్రీ ఫ్యాబ్రికేటెడ్ మిలిటరీ భవనాలకు స్టీల్ లేదా అల్యూమినియం ఫ్రేములను, గోడలకు, పైకప్పుకు సింథటిక్ మెటీరియల్‌ను వాడతారు. ఫ్లోరింగ్ కోసం ప్లాస్టిక్ మెటీరియల్‌ను వాడతారు. దీనివల్ల ఈ విడిభాగాలన్నింటినీ త్వరగా అమర్చడంతోపాటు మన్నికగానూ వుంటాయి. ఈ ప్రీ ఫ్యాబ్రికేటెడ్ గృహాలకు ఉపయోగించే స్టీల్, కలప, ఫైబర్ గ్లాస్, ప్లాస్టిక్, అల్యూమినియం వంటివి మనం సాధారణంగా ఉపయోగించే ఇటుక, కాంక్రీట్ భవనాలకంటే తక్కువ ధరకే అందుతాయి. ప్రస్తుతం వీటిని క్రీడా భవనాలకు వాడుతున్నారు.

ప్యానల్ బిల్డింగ్

ప్యానల్ బిల్డింగ్ అంటే... ముందుగా స్థలంలో ఫ్లోరింగ్ చేస్తారు. వాటిపై ప్యానల్స్ నిలబడడానికి అనువుగా వుండేందుకు ఇనుప స్ట్రిప్స్‌ను అమర్చుతారు. ఆ తర్వాత మనం తయారు చేసుకున్న ఇంటినిర్మాణం ప్లాన్ ప్రకారం ప్యానల్స్‌ను అమర్చుతారు. అంటే ముందుగా తయారు చేసుకున్న సైడ్‌వాల్స్‌ను ఇనుప స్ట్రిప్‌లపై నిలబెడతారు. ఈ స్ట్రిప్‌లు రెండువైపులా పైకి వంపుతిరిగి వుండడం వల్ల ప్యానల్‌ను కదలకుండా చేస్తాయి. అనంతరం సీలింగ్‌ను కూడా ఇదే పద్ధతిలో అమర్చుతారు. ఈ ప్యానెల్స్‌లో టాయ్‌లెట్స్, సింక్, వాష్‌బేసిన్‌లు, లైట్స్.. ఇలా నివాసానికి అవసరమైన అన్నింటినీ అమర్చి జాగ్రత్తగా తరలించి మనకు నచ్చిన విధంగా అమర్చుతారు. తక్కువ శ్రమ, తక్కువ వ్యయంతో ఇల్లు పూర్తవుతుంది.

చరిత్ర

మొదటి ఫ్యాబ్ గృహాలు, కదిలే గృహాలు 16వ శతాబ్దంలో అక్బర్ పరిపాలనలో కనుగొన్నారు. ఈ నిర్మాణాలను 1579లో ఆరిఫ్ క్వందహరి అందించారు. ఈ విషయం మాన్యూర్ పియరీ బోట్ పుస్తకం ద్వారా తెలుస్తోంది. దీని చరిత్రను 2015లో ఫ్రెంచ్ పత్రిక ఒక మ్యాగజైన్‌లో ప్రత్యేక వ్యాసంగా ప్రచురించింది. ఈ గృహాలను విదేశాలలో అధికంగా వాడడానికి కారణం కూడా తెలియజేసింది. ప్రపంచ యుద్ధాలు, దాడులు జరిగే సమయంలో ఈ గృహాల ఉపయోగం ఎంత ఉందో తెలిపింది.

ఆ తర్వాత మొట్టమొదట మాడ్యులర్ గృహాన్ని 1837లో దక్షిణ ఆస్ట్రేలియాకు చెందిన హెన్రీ మానింగ్ రూపొందించినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన కాంపొనెంట్స్‌ను లండన్‌లో తయారుచేసి ఆస్ట్రేలియాకు తరలించారు. ఆ తర్వాత 1855లో మాడ్యులర్ ప్రీఫాబ్రికేటెడ్ ఆసుపత్రిని క్రిమియా యుద్ధ సమయంలో రూపొందించారు. ఆసుపత్రి పాత భవనంలో సేవలందిస్తోన్న ఫ్లోరెన్స్ నైటింగేల్... తమ ఆసుపత్రి పరిస్థితి ఏమీ బాగోలేదని, దాన్ని మరింత ఆధునీకరించాలని లండన్ టైమ్స్‌కు ఒక ఉత్తరం రాసింది. ఆ తర్వాత ఐదు నెలలకు ఇస్మాబర్డ్ కింగ్‌డమ్ బ్రూనెల్ డిజైన్ చేసిన మాడ్యులర్ ఆసుపత్రిని క్రిమియాకు తరలించారు.

ఆ తర్వాత మరో గృహాన్ని 1920లో నిర్మించారు. ఇదొక పోర్టబుల్ మాడ్యులర్ గృహం. విద్యుత్ సహా అన్నిరకాల సాంకేతికపరమైన అంశాలతో పాటు ఫర్నిచర్‌ను కూడా దీనిలో ఏర్పాటు చేశారు. దీని ఆర్కిటెక్చర్... ఆ తర్వాత మాడ్యులర్ ఇళ్ల నిర్మాణానికి బాటలు వేసింది. అదేవిధంగా 1940లో సియర్ రోబక్ అనే అమెరికన్ కంపెనీ మొదటిసారిగా తమ దేశంలో మాడ్యులర్ భవనాన్ని నిర్మించింది.

అనంతరం రవాణాకు అనువైన మాడ్యులర్ ఇళ్లతో పాటు పోర్టబుల్, ప్రీఫ్యాబ్రికేటెడ్, మానుఫ్యాక్చర్డ్, ప్రీ బిల్ట్, వృద్ధుల ప్లాట్స్, ప్రీ ఫ్యాబ్స్, క్యాబిన్స్, హాలిడే పార్క్ క్యాబిన్స్, టూరిస్ట్ క్యాబిన్స్‌తో పాటు వీటికంటే చవకవైన గృహాలు... ఇవన్నీ మాడ్యులర్ గృహాల్లోని రకాలు. అయితే, సాంప్రదాయ పద్ధతిలో నిర్మించిన గృహాలను కొద్ది సంవత్సరాల తర్వాత వేరేచోటికి తరలించాలంటే కుదరదు. కానీ ఈ మాడ్యులర్ గృహాలను మనకు కావాల్సిన చోటుకి తరలించగలిగేలా వుంటాయి.



1920 లో మాడ్యులర్ హౌస్

66 వేలకే...

టెక్నాలజీ పరిష్కరించలేని సమస్య అంటూ లేనప్పటికీ ఇంటి నిర్మాణం విషయంలో ఇప్పటికీ ఆ లోటు ఉంది. దాన్ని తీర్చేందుకు వియత్నాం పరిశోధకులు విజయం సాధించారు. ఎస్ హౌస్ పేరుతో వెలుగులోకి తీసుకువచ్చిన ఈ ఆవిష్కరణలో 340 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే ఇళ్లు మూడు గంటల్లో పూర్తవుతుంది. అదేంటి ఇంత తొందరగా అంటే ప్రీ ఫ్యాబ్రికేటెడ్ కావచ్చేమో అనుకుంటున్నారా? దాదాపుగా అలాంటిదే. కాంక్రీట్ ఫౌండేషన్ - ఉడెన్ ఫ్లోర్ - స్టీల్ ఫ్రేమ్ - స్టీల్ షీట్ రూఫ్ - స్టీల్ డ్రైనేజ్ గటర్... ఇవే ఈ ఇంటి సరంజామా. ముందుగా వీటిని వేరువేరుగా తయారు చేస్తారు. అన్నింటినీ కలిపి ఒక చోట అమర్చుకుంటే చాలు ఎస్ హౌస్ ఇంటి నిర్మాణం పూర్తి అయిపోతుంది.

మూడు గంటల్లో పూర్తయిపోతోంది కదా అని దీని నాణ్యతను శంకించాల్సిన అవసరమేలేదు. దానికీ టెక్నాలజీతోనే పరిష్కారం కనిపెట్టారు. ప్రకృతి వైపరీత్యాలను కూడా తట్టుకుని నిలబడే స్థాయిలో ఈ నిర్మాణం డిజైన్ చేశారు. ఎస్ హౌస్ నిర్మాణానికి ఉపయోగించిన విశిష్టమైన టెక్నాలజీ ద్వారా ఈ ఇంటికి ఉపయోగించిన చెక్కకు చెదలు పట్టే అవకాశమే లేదంట. ఇనుముకు తుప్పు పట్టడం కూడా ఉండదని డిజైనర్లు స్పష్టం చేస్తున్నారు. ఇంతే కాదు..ముప్పై సంవత్సరాలు చెక్కుచెదరకుండా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఎస్ హౌస్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోగా, ప్రస్తుతం డిజైన్ పూర్తయి మొదటి నిర్మాణం వియత్నాంలో ప్రదర్శించారు. దీన్ని పెద్ద ఎత్తున త్వరలోనే మార్కెట్‌లోకి తీసుకువచ్చేందుకు డిజైనర్లు కసరత్తు చేస్తున్నారు.

మాడ్యులర్ బిల్డింగ్

మాడ్యులర్ గృహాలంటే... రెండూ లేదా అంతకంటే ఎక్కువ ఫ్యాక్టరీలలో తయారుచేయబడిన బాక్సులను కలిపి బిగించడం ద్వారా సురక్షితమైన, దృఢమైన గృహాన్ని నిర్మిస్తారు. ఫ్యాక్టరీలలో మాడ్యులర్ తయారీదారుల ఉత్పత్తి సామర్థ్యాలు, సాంకేతికత, మాడ్యుల్స్‌ను అమర్చే పద్ధతి వేర్వేరుగా వుంటాయి. ప్రస్తుతం మాడ్యులర్ తయారీదారులు స్టీల్, కాంక్రీట్‌కి బదులుగా చెక్క ఫ్రేమ్‌లను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఈ మాడ్యుల్స్ అన్నింటినీ క్రేన్స్ సహాయంతో అమర్చుతారు. ఇలా గృహానికి అమర్చిన బాక్సులను మాడ్యుల్స్ అంటారు. కనుకనే వీటికి మాడ్యులర్ గృహాలు అని పేరు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఈ తరహా గృహ నిర్మాణం గతంకంటే కూడా ఇటీవలి సంవత్సరాలలో ఎక్కువగా ఆదరణ పొందుతోంది. ప్రస్తుతం కొత్త గృహనిర్మాణ రంగంలో వున్నవాటన్నింటికంటే మాడ్యులర్ గృహనిర్మాణ పరిశ్రమ వేగంగా విస్తరిస్తోంది. దీనికి కారణం.. తక్కువ ఖర్చు, వేగంగా నిర్మించగలగడంతోపాటు పర్యావరణ పరంగానూ అనుకూలంగా వుండడమే.

మ్యానుఫ్యాక్చర్డ్ గృహాలు

ఈ పద్ధతిలో వాస్తవానికి ఇల్లు కట్టే ప్రదేశంలో ఏ రకమైన పనులూ జరగవు. మొత్తం ఫ్యాక్టరీలోనే తయారుచేస్తారు. వీటిని స్టీల్ ఫ్రేమ్ మీద కడతారు. ఈ నిర్మాణాలకు అడుగుభాగంలో చక్రాలను కూడా అమర్చుతారు. మొత్తం ఇంటినిర్మాణం పూర్తయిన తర్వాతనే ఇంటిని నిర్మించుకోవాలనుకున్న స్థలానికి తరలిస్తారు. అలా తరలించిన ఇంటిని కాంక్రీట్ స్లాబ్‌పై కూర్చుండబెడతారు. ఆ తర్వాత చక్రాలను తొలగిస్తారు. ఒక్కోసారి చక్రాలను అలాగేవుంచి సిమెంట్‌తో కవర్ చేస్తారు.

ఈ తరహా గృహాల తయారీ పాశ్చాత్య దేశాలలో అధికంగా వుంది. వీటిని తయారు చేసే కంపెనీలు కూడా అక్కడ ఎక్కువగానే ఉంటాయి. మనం సాధారణంగా నిర్మించుకొనే గృహాలు ఎంతో పటిష్టంగా వుంటాయి. కాని ఈ మ్యానుఫాక్చర్డ్ గృహాల నిర్మాణం దీనికి భిన్నంగా, తక్కువ ఖర్చుతో అయిపోతుంది. సాధారణంగా ఈ మ్యానుఫ్యాక్చర్డ్ గృహాలు అంతటా ప్లంబింగ్‌తో అమర్చబడి ఉంటాయి. వీటికి విద్యుత్ లైన్లు ఒక ఇంటికి కావలసిన ఉపకరణాలను అన్నింటిని అమర్చబడి ఉంటాయి. వివిధ విభాగాలలో కూడా ఈ మ్యానుఫ్యాక్చర్డ్ గృహాలను నిర్మిస్తుంటారు. అంటే సింగిల్, డబుల్, ట్రిపుల్ బెడ్ రూమ్‌ల రూపంలో వివిధ నమూనాలలో వీటిని నిర్మిస్తారు. ఈ ఫ్యాబ్రికేటెడ్ గృహాలను ముందుగా ఆర్డర్ ఇచ్చి చేయించుకొనేవారు, కాని ఇప్పుడు ఆన్‌లైన్‌లోనే అనేక రకాల నమూనాలతో తయారు చేసిన ఇళ్లు దొరుకుతున్నాయి. దాన్ని ఆర్డర్ చేసిన తర్వాత గృహాన్ని మన నిర్మాణ స్థలంలో పొందుపరచేటప్పుడు ఏమైనా పగుళ్లు రావడం లేదా విరగడం వంటివి జరిగినా అప్పటికప్పుడు వాటిని రిపేర్ చేస్తారు. ఏవైనా ఉపకరణాలను తప్పుగా అమర్చినా, వైరింగ్, ప్లంబింగ్‌లకు సమస్యలు వచ్చినా వెంటనే మరమ్మతు చేస్తారు. ఈ మరమ్మతులతో పాటు వారెంటీ కూడా కంపెనీవారే ఇస్తున్నారు. ఒకవేళ వారెంటీ పూర్తయిన తర్వాత సమస్యలు వస్తే వినియోగదారుడే మొత్తం ఖర్చును భరించాల్సి ఉంటుంది.



ఇండియాలో తొలి ప్రీ ఫ్యాబ్రికేటెడ్ హౌస్

మాడ్యులర్ గృహాలు మామూలు ఇళ్లకంటే దృఢంగా వుంటాయి. వీటికి రీసేల్ విలువ కూడా వుంటుంది. వీటిని బైక్‌లు, కార్లు అమ్మినట్లుగానే అమ్మవచ్చు. వీటి విలువ ఆయా ఇళ్ల నిర్మాణం, డిజైన్, శానిటేషన్, ఫర్నిచర్ వంటి సదుపాయాలపై ఆధారపడి వుంటుంది. ప్రీఫ్యాబ్ ఇళ్ల ప్రాథమిక డిజైన్లకు కొన్ని పరిమితులు వున్నప్పటికీ, ఆధునిక టెక్నాలజీ, సాంకేతిక విలువలతో రూపొందించిన వాటికి మంచి సౌలభ్యం వుంటుంది. మన అభిరుచిని బట్టి తయారీదారులు మనకు డిజైన్ చేసిస్తారు. మొదట్లో ఈ ప్రీ ఫ్యాబ్ ఇళ్లను చెక్కతో రూపొందించేవారు. ఇప్పుడు అందుబాటులోకి వచ్చి సాంకేతికత ఆధారంగా స్టీల్ ఫ్రేమ్‌లను ఉపయోగిస్తున్నారు. అదేవిధంగా ఏ ఇల్లు అయినా అందంగా కనబడాలంటే దాన్ని రూపొందించే ఆర్కిటెక్ట్ మీద ఆధారపడి వుంటుంది. క్వాలిటీ పరంగా చూసినప్పుడు కాంక్రీట్ ఇళ్లకంటే ప్రీ ఫ్యాబ్రికేటెడ్ ఇళ్లు ఎంతో గట్టిగా వుంటాయని అమెరికాకు చెందిన ఫెమా (ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) చెబుతోంది. ఇవి ఎలాంటి వాతావరణాన్నయినా తట్టుకోగలవు. అయితే అప్పుడప్పుడు కొన్ని మరమ్మతులు తప్పనిసరి.

చైనాలో అత్యంత వేగంగా..ఎత్తుగా...

సెంట్రల్ చైనాలో 57 అంతస్తుల ఆకాశహర్మ్యాన్ని 19రోజుల్లో నిర్మించి, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అత్యంత ఎత్తైన భవన నిర్మాణం చేసిన సంస్థగా చైనీస్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రికార్డు సృష్టించింది. సంప్రదాయ పద్ధతిలో అయితే ఈ ఆకాశహర్మ్యాన్ని నిర్మించడానికి ఇటుక ఇటుకను పేర్చాలి. కాని మా పద్ధతిలో అయితే కేవలం బ్లాక్స్‌ను పేర్చితే సరిపోతుంది... అని ఆ కంపెనీ ఇంజనీర్స్ చెబుతున్నారు. ప్రస్తుతం ఈ తరహా నిర్మాణాలు

థర్మాకోల్ 'ఇళ్లు'



థర్మాకోల్‌తో చిన్నప్పుడు బొమ్మల ఇళ్లు కట్టాం.. కానీ అదే థర్మాకోల్‌తో నిజమైన ఇల్లు కట్టేస్తే.. అదీ తుపాను గాలులను సైతం తట్టుకునేలా నిర్మిస్తే.. ప్రకృతి విపత్తులు, తుపాన్ల సమయంలో 300 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురు గాలుల్ని సైతం తట్టుకునేలా 'ప్రీ ఫ్యాబ్రికేటెడ్' ఇళ్ల నిర్మాణాలను ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో చేపడుతున్నారు. థర్మాకోల్ షీట్లతో ఇళ్లు నిర్మించే ఈ సరికొత్త టెక్నాలజీని తొలిసారిగా ఇక్కడ వినియోగించడం విశేషం. సాధారణ గృహాల మాదిరి పునాదులు, పిల్లర్లు, బీమ్‌లు ఇనుము, కాంక్రీట్‌తోనే నిర్మించి.. గోడలు, కిటికీలు, మరుగుదొడ్లకు థర్మాకోల్ షీట్లను వాడుతున్నారు. సాధారణ షీట్లు కాకుండా రసాయనాలు మిక్స్ చేసి ల్యాబ్‌ల్లో పరీక్షించిన థర్మాకోల్ షీట్లనే వినియోగిస్తున్నారు. స్లాబ్ సమయంలో ఈ షీట్లను వైర్లతో అల్లి చుట్టూ రసాయనాలు పూసి కాంక్రీట్ పూతతో పూర్తిచేస్తారు. థర్మాకోల్ షీట్ల చుట్టూ ఐరెన్ మిక్స్ అయిన (తుప్పు పట్టని) జీఐ వైరు ముక్కలతో ఓ బాక్స్ తయారు చేస్తారు. వాటిని వివిధ సైజుల ప్రకారం అమర్చుతారు. రెండు పిల్లర్ల మధ్య బాక్స్‌ల మాదిరిగా వీటిని అమర్చి అనంతరం రసాయనాలు పూస్తారు. తరువాత గన్ పెయింటింగ్ తరహాలో కాంక్రీట్‌తో బలం వచ్చేలా చేస్తారు. గోడలు తయారైన తరువాత చూస్తే సాధారణ ఇళ్ల నిర్మాణం మాదిరిగానే కనిపిస్తుంది. మేకులు కొట్టుకునేందుకూ అనువుగా ఉంటుంది. సాధారణ గృహ నిర్మాణానికి ఏడాది కాలం పడితే థర్మాకోల్ షీట్లతో ఆరునెలల్లోనే పూర్తవుతుంది. ఒక్కో ప్లాటుకు రూ.500 విలువ చేసే 2X3 మీటర్లుండే 26 షీట్లను ఉపయోగించి గోడలు నిర్మించుకోవచ్చు. ఈ థర్మాకోల్ ఇళ్ల వల్ల సమయం, డబ్బు ఆదా చేయవచ్చు. భారీ తుపాన్లను సైతం ఇవి తట్టుకోగలవు. అగ్ని ప్రమాదాలు సంభవించినా ప్రాణ/ఆస్తినష్టం వాటిల్లే అవకాశాలు ఉండవు. శబ్దకాలుష్యం నుంచి విముక్తితోపాటు వేసవిలో చల్లదనం పొందొచ్చు. చెన్నైకు చెందిన 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ స్ట్రక్చరల్ సెంటర్' (సీఐఎస్ఆర్) సంస్థ థర్మాకోల్ షీట్ల పంపిణీలో కీలక బాధ్యత వహిస్తోంది.

బ్రిటన్, యుఎస్‌ఎల్‌లో కూడా జరుగుతున్నాయి. ఈ మినీ స్కైసిటీలో మొత్తం 19 ఆట్రియంలు, 800 అపార్ట్‌మెంట్లు, 4000మందికి ఆఫీసులు వుంటాయి. ఈ తరహా భవన నిర్మాణం సురక్షితంగా వుండడంతోపాటు భూకంపాలను కూడా తట్టుకుంటుందని ఆ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ జియో ఛాంగ్‌గెంగ్ చెబుతున్నారు. ప్రస్తుతం ఈ కంపెనీ ప్రపంచంలోనే పొడవైన 220 అంతస్తుల ఆకాశహర్మ్యాన్ని 3నెలల్లో పూర్తిచేయాలనే లక్ష్యంతో సన్నద్ధమవుతున్నారు.

భారత్‌లో

48 గంటల్లో 10 అంతస్తుల భవనం

చైనాలో ఎంతో ఆదరణ పొందిన, చాలా వేగవంతంగా నిర్మాణాలను చేయగల సారా కొరోన్స్ ద్వారా డిసెంబర్ 1, 2012లో భారత్‌లో మొట్టమొదటగా ప్రీ ఫాబ్రికేటెడ్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి 48 గంటల్లో 10 అంతస్తుల భవనాన్ని నిర్మించారు.చండీగఢ్‌లోని మొహాలీ పట్టణంలో దీన్ని నిర్మించారు. ఇంజనీర్, టెక్నీషియన్స్, సూపర్‌వైజర్లతో కూడిన బృందం ఈ నిర్మాణంలో పాలుపంచుకుంది. మొత్తం ప్రాజెక్ట్ బాధ్యతలను ప్రముఖ వ్యాపారవేత్త హర్పాల్‌సింగ్ నిర్వహించారు. తన కంపెనీ మౌలిక పద్ధతులను ఉపయోగించి వివిధ కర్మాగారాల నుండి నాణ్యమైన సామగ్రిని తెప్పించి ఈ నిర్మాణానికి ఉపయోగించారు. నిర్మాణానికి కావలసిన వివిధ విభాగాలను, వస్తువులను ముందుగానే తయారు చేసి నిర్మాణాన్ని ప్రారంభించారు. ముందస్తుగా నీటి సరఫరా భాగాలను, వైరింగ్ పనులను, పారిశుధ్యం, ఎయిర్ కండిషన్ పరికరాలను, ఇతర ఉపకరణాలను అమర్చారు. వీటిని వాహనాల ద్వారా నిర్మాణ స్థలానికి చేర్చారు. 200 మంది

కార్మికులు, 200 టన్నుల ఉక్కు, మూడు క్రేన్లను ఉపయోగించి అధిక తీవ్రతగల భూకంపాలను సైతం తట్టుకొనే విధంగా, తక్కువ సమయంలో దృఢంగా దీన్ని నిర్మించారు.

3డి ఇల్లు

3 గంటల్లోనే

3డి ప్రింటింగ్ ఇప్పుడు అన్ని రంగాల్లోనూ ప్రవేశిస్తోంది. నిర్మాణరంగంలో 3డి ప్రింటింగ్ అనేది కళాత్మకమైన నిర్మాణాలకు వేదికవుతుంది. సాంకేతిక రంగంలో అగ్రభాగాన వున్న చైనా 3డి గృహాలను నిర్మించి అబ్బురపరిచింది. అదీ 3గంటల్లోపే నిర్మించడం విశేషం. గతేడాది జూలైలో ఈ నిర్మాణాన్ని రూపొందించారు. ముందుగా డైనింగ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్, బెడ్‌రూమ్స్‌గా ఆరు మాడ్యుల్స్‌గా రూపొందించి, తర్వాత వాటన్నింటినీ కలిపి రెండు అంతస్థుల భవనంగా ఒక క్రమ పద్ధతిలో అమర్చింది. చైనాకు చెందిన ఝూడా గ్రూప్ సంస్థ ఈ ప్రక్రియను అభివృద్ధి చేసింది. ఇంటీరియర్ డిజైన్స్‌తో పాటు భూకంపాలకు, అగ్నిప్రమాదాలకు కూడా తట్టుకునే విధంగా రూపొందించారు. అయితే ఇందుకు ఉపయోగించిన ప్రత్యేక పదార్థాలను మాత్రం రహస్యంగా వుంచారు. ఫ్యాక్టరీలో 90శాతం ఫాబ్రికేటెడ్ పద్ధతిలో రూపొందించిన మాడ్యుల్స్‌ను నిర్మాణస్థలికి తరలించారు. అనంతరం వీటిని క్రేన్‌ల సహాయంతో అమర్చారు. ఒక్కో మాడ్యుల్ చదరపు మీటరు సుమారు 220పౌండ్స్ (100కేజీలు) బరువు వుంటుంది. ఈ కంపెనీ 500చదరపు మీటర్ల వైశాల్యం గల 3డి గృహాన్ని 15రోజుల్లో నిర్మించడం మరో విశేషం.

33 రోజుల్లో

లిటిల్ టోక్యో టవర్స్

ఆధునిక భవన నిర్మాణంలో ప్రీఫాబ్ నిర్మాణం ఇప్పుడు హాట్ ట్రెండ్. కానీ 36ఏళ్ల క్రితమే ప్రిఫాబ్ పద్ధతిలో లిటిల్ టోక్యో టవర్స్‌ను 33రోజుల్లో నిర్మించారు. దీన్ని 1975 మే 21న ప్రారంభించి, జూలై9 కల్లా పూర్తి చేశారు. ఈ భవనాన్ని సుమారు రెండురోజులకు ఒక ఫ్లోర్ చొప్పున నిర్మించారు. కార్పెంటింగ్ పనులు, రంగులు వేయడం పూర్తికాగానే ఈ భవనంలో నివసించడం ప్రారంభించారు. గుండె ఆకారంలో వుండే ఈ మాడ్యుల్స్‌లో కిచెన్, బాత్‌రూమ్ కలిపి వుంటాయి.

ఇవండీ రెడీమేడ్ ఇళ్ల విశేషాలు.

– రాజాబాబు కంచర్ల

కంటిపాప చిత్రం



నయనాల్లోనే మనం మనంగా ఉంటాం. మనమేంటో కనిపిస్తాం. నవ్వుతో, కన్నీటితో మోసం చేయొచ్చు గానీ కనుల కొలకు, కనుపాపల్లో మాత్రం నిజం దాగదు. ఆ కళ్లే మార్యీస్జ్‌కు ఇష్టం. ఆ కళ్లు చెప్పే భావాలు, విప్పార్చే భావోద్వేగాలు ఇంకా ఇష్టం. ఎదురుగ్గా కూర్చుని వాటిల్లో ప్రతిబింబిస్తూ పొట్రాయిట్‌లను సృజిస్తుంటాడు పోలాండ్‌కు చెందిన గ్రాఫైట్ చిత్రకారుడు మార్యీస్జ్ కెడ్జెర్స్కి. కళ్లలోని భావాల్ని హైలెట్ చేస్తూ బ్లాక్ అండ్ వైట్ చిత్రానికి జీవాన్ని నింపే అతడి చేతుల్లో పెన్సిల్ కుదురుకుంది.. అరచేతులు లేకున్నా...

అది పోలెండ్‌లోని స్విడ్నికా నగరం. ఓ వీధి దీప స్తంభం చుట్టూ జనం మూగారు. మార్యీస్జ్ గుంపును పట్టించుకోకుండా ఎదురుగ్గా కూర్చున్న యువతి వ్యక్తిత్వాన్ని తన పెన్సిల్ పొట్రాయిట్‌లోకి లాగేస్తున్నాడు. ఆమె నవ్వుతోంది. అది ముందే అచ్చుపోసుకుంది. కానీ పెన్సిల్ మెల్లగా నడుస్తోంది కళ్ల మీద. కనుబొమ్మలపై నుంచి పెన్సిల్ గీత జాలువారింది. అక్కడ చకచకలాడిన కొన్ని చిన్న గీతలు ఆమె నవ్వు నకిలీదని తేల్చేశాయి. ఆమె హృదయంలో ఏదో విషాదాన్ని పైకి తేల్చాయి. మార్యీస్జ్‌కు ఆ యువతికి తప్ప ఆ విషయం ఎవరికీ తట్టలేదు, భావోద్వేగాల్లో ఒకరికీ పట్టలేదు. చుట్టూ చప్పట్ల వర్షం. ఇంతకీ అంత స్పందనకు కారణం అరచేతులు లేని మార్యీస్జ్ ఆ అమ్మాయి చిత్రాన్ని అంత స్పష్టంగా గీయడం. వేలి మధ్య వంపులు తిరగాల్సిన పెన్సిల్‌ను మొండి చేతులతో బిగించి పట్టి కదిలించడం. పుట్టుకతోనే మార్యీస్జ్‌కు హస్తాలు లేవు. ఉన్న చేతులు సరిగ్గా అభివృద్ధి చెందలేదు. ఎన్నో శస్త్ర చికిత్సలు అయినా ప్రయోజనం అంతంత మాత్రమే. ఎన్నోసార్లు అందరూ ఉన్నాడని నమ్మే దేవుణ్ని నిలదీశాడు. కానీ సమాధానం రాలేదు. చివరిసారిగా 16 ఏళ్లపుడు శస్త్ర చికిత్స జరిగింది. కానీ మెరుగంటూ ఏమీ లేదు. పసిపాపలాంటి అతడి పరిస్థితి వల్ల మార్యీస్జ్‌ను తల్లిదండ్రులు కంటిపాపలా చూసుకునేవారు. మిగతా పిల్లల్లా కొడుకు అరచేతుల్లో తమ చెంపల్ని పెట్టి ప్రేమల్ని పంచుకునే అదృష్టం లేదని బాధపడేవారు. మార్యీస్జ్ ఇక దేవుణ్ని, శస్త్రచికిత్సల్ని, అదృష్టాల్ని వదిలేశాడు. తన బుర్రలో పోగుబడ్డ అడ్డంకుల్ని దాటేశాడు. ఏ చేతులైతే మొండిగా తన వైకల్యాన్ని వెక్కిరిస్తున్నాయే వాటితోనే అసాధ్యమనుకున్న అద్భుతాల్ని సృజించాలని నిశ్చయించాడు. చిత్రకళంటే చిన్నప్పటి నుంచి ప్రాణం. దాన్నే ఎంచుకుని ప్రయత్నం మొదలు పెట్టాడు. పెన్సిల్‌ను తీసుకోవడమే అసాధ్యంగా ఉండేది. వందల సార్లు జారిపోయింది, వేల సార్లు జరిగిపోయింది. చివరికి మార్యీస్జ్ పట్టుదల ముందు అణిగిమణిగిపోయింది. తొలుత చిత్రాలు గీయడాన్ని సొంతగా అభ్యసించినా తర్వాత వ్రొక్లాలోని 'ఇ గ్రెపెర్ట్ అకాడమీ ఆఫ్ ఆర్ట్ అండ్ డిజైన్'లో చేరాడు. ఇరవై ఏళ్లపుడు మార్యీస్జ్ 2013లో వియన్నాలో నిర్వహించిన గ్లోబల్ ఆర్టిస్ట్ పోటీల్లో పాల్గొని సెకండ్ బెస్ట్‌గా నిలిచాడు. అదే దన్నుగా తనలాంటి వారికే కాదు మిగతా వాళ్లందరికీ స్ఫూర్తినిచ్చేందుకు 'మార్యీస్జ్ డ్రాస్' పేరిట ఓ పొట్రాయిట్ యాత్ర మొదలెట్టాడు. యూరప్‌లోని మహానగరాలన్నింటా తిరుగుతూ జనజీవనం నడి మధ్యన కేన్వాస్ తెరుస్తున్నాడు. బెర్లిన్, ఆమ్‌స్టర్‌డ్యామ్, లండన్, ప్యారిస్, బార్సిలోనా, వెనీస్, రోమ్, ఏథెన్స్‌ల్లో మార్యీస్జ్ చిత్ర కళను కళ్లార్పకుండా చూస్తూనే.. ధీశక్తిని గుండెల నిండా ప్రోది చేసుకున్నారు. అవధులు, అడ్డంకులనేవి మన బుర్రల్లోనే పోగుబడేవని, ప్రయత్నిస్తే ఒక్కోటి కూలిపోతుంటాయని చెప్పే మార్యీస్జ్ ఒక్కో చిత్రానికి 10–20 గంటల సమయం పడుతుంది. ఒక చిత్రానికైతే ఏకంగా 100 గంటలు పట్టింది. ఏడేళ్లలో 15 వేల గంటలు అతడి కళాతృష్ణకు అంకితమై 700 చిత్రాల్ని అందించాయి. వాటిని చూసినప్పుడల్లా మార్యీస్జ్ కళ్లు మెరుస్తుంటాయి. అతడి కళ్లలో అతీతమైన ఓ భావం ప్రతిబింబిస్తుంది. దాంట్లో స్ఫూర్తి ప్రతిఫలిస్తుంది. ✦



100 గంటలు పట్టిన చిత్రం..







తెలుసా

సైకిల్‌కు పట్టపగలు లైట్ లేనందుకు డబ్బులు వసూలు చేసే ట్రాఫిక్ కానిస్టేబుల్ పాత్రలో ఓ సినిమాలో పి.ఎల్.నారాయణ ఎప్పటికీ గుర్తుండి పోతాడు. నిజంగానే ఆ రూల్ దేశంలో ఉండేది. సినిమాలోలా కాదు గానీ రాత్రి వర్తించేది.

మద్యం తాగి వాహనాలు నడపడం దాదాపు అన్ని దేశాల్లో నేరం. కానీ కోస్టారికాలో బ్లడ్ ఆల్కహాల్ లెవల్ 0.75 శాతం మించకుండా తాగేస్తే ఎంచక్కా కారు నడుపుకుంటూ వెళ్లొచ్చు.

జర్మనీలో ఆటోబాహ్న్ అని మోటార్‌వేలను పిలుస్తారు. వాటిల్లో డ్రైవింగ్ ఓ మజా. కానీ, ప్రయాణానికి సరిపడా ఇంధనం కచ్చితంగా కారు ట్యాంకులో ఉండాల్సిందే. ఎందుకంటే ఆటోబాహ్న్‌ల మీద కారు ఆపడం నేరం.

ఇక్కడ లక్కీ నెంబర్ల కోసం అందునా నంబర్ వన్ కోసం లక్షలు తగలేసినట్టు ఫిలిప్పైన్స్ రాజధాని మనీలాలో వాహన నంబర్ రిజిస్ట్రేషన్ తీసుకుంటే కష్టమే. అక్కడ 1, 2 లు చివరి అంకె ఉన్న వాహనాల్ని సోమవారం నడపకూడదట. ఆడ్, ఈవెన్ సిస్టమ్ కాదులెండి.



చిన్నచిన్న విషయాలకే రోడ్ల మీద వాహనదారుల పోట్లాటలు ఇక్కడ నిత్యం కనిపించేదే. ఇలా గానీ అమెరికాలో ముఖ్యంగా మేరీల్యాండ్‌లో కొట్లాడుకుంటే ఇరు వర్గాలు ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చిద్ది.

సౌతాఫ్రికాలో జంతువుల్ని తరలించే వాహన డ్రైవర్ స్టాప్ సిగ్నలిస్తే కచ్చితంగా తోటివారు కారు ఆపాల్సిందే. లేకుంటే చేతి చమురు బానే వదిలిద్ది.

కంటి చూపు సరిచేసే కళ్లద్దాలు వాడే వారు స్పెయిన్‌లో మరో స్పేర్‌ను రెడీగా వాహనంలో ఉంచుకోవాలి. లేకుంటే అవి కొనేందుకు అయ్యే డబ్బుకు మించి ఫైన్‌లు కట్టాలి.

సైప్రస్‌లో మద్యమే కాదండి కారు నడిపేటపుడు చిరుతిండి కాదు గదా, మంచినీళ్లు కూడా తాగకూడదు. గొంతు తడుపుకోవాలంటే కారు పక్కకు ఆపుకోవాల్సిందే. అనవసరంగా స్టీరింగ్ వీల్ మీది నుంచి చేయి తీస్తే ఫైన్ వడ్డించేస్తారు.

జపాన్‌లో తాగి నడిపే డ్రైవర్లకే కాదు వారి వాహనాల్లో ప్రయాణిస్తున్న వాళ్లు కూడా చిక్కులు కొని తెచ్చుకున్నట్టే.

స్విట్జర్లాండ్‌లో రోడ్డు దాటుతున్న పాద చారుల కోసం వాహనాలు కచ్చితంగా ఆగా ల్సిందే. దారి ఇవ్వాల్సిందే.

పట్టపగలు లైట్లేసుకుని వాహనం ఎదురైతే బారు కట్టి సిగ్నల్స్ ఇస్తామిక్కడ. అదే స్వీడన్‌లో పగలు లైట్లేసుకుని వెళ్లాలని నియమం.

రష్యా సంగతికొస్తే క్లీన్‌గా లేని కారేసుకుని రోడ్డున పడితే భారీగా ఫైన్ కట్టాలి.

కిడ్నాపర్ నుంచి రక్షకుడిగా..

నైగేల్ అక్కారాది మరో మేలి మలుపు. కోల్‌కతాకు చెందిన అక్కారాకు 21 ఏళ్ల వయసులో 2000 సంవత్సరంలో ఓ కిడ్నాప్ కేసులో శిక్ష పడింది. తొమ్మిదేళ్ల అనంతరం విడుద లైన అక్కారా ఓ లక్ష్యంతో బయటకు వచ్చాడు. ఎక్క డైతే తాను చెడ్డ పేరు పొం దాడో అక్కడి సమాజం మామూలు మనిషిగా గుర్తిం చేలా మంచి పని చేయాలి. తిరిగి కుటుంబంతో కలవాలి. అయితే అదేమంత సులభం కాలేదు. బి.కామ్‌తో పాటు మాస్టర్స్ డిగ్రీ ఉన్నా కూడా ఉద్యోగం దొరకడమే అసాధ్యమైంది. కుటుంబం, సమాజం ఎంత అనుమానంగా చూసినా ఓపిక పట్టాడు. తొలి ఏడాదంతా ఒంటరిగానే గడిపాడు. ఓ ఎన్జీవో సాయంతో నెలకు 4500 రూపాయల జీతానికి ఓ ఉద్యోగం దక్కించుకున్నాడు. కానీ అది కోల్‌కతాలో చాలదు. ఒక్కపూటే కడుపు నింపుకుని ఎలాగోలా నెట్టుకొచ్చాడు కానీ, కోల్‌కతాను విడవలేదు. క్రమక్రమంగా నలుగురిలో విలువను పెంచు కుంటూ మారిన మనిషిలా సమాజం అంగీకరించేలా చేశాడు. ఓ మంచి ఆలోచన చేసి కోల్‌కతా ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ అనే మేన్‌పవర్ సేవల కంపెనీని ప్రారంభి ంచాడు. తనలాంటి వారు నిలదొక్కుకునేలా చేయడమే కంపెనీ లక్ష్యం. జూలై 2010లో ప్రారంభమైన ఆ కంపెనీ ద్వారా ఇప్పటి వరకు తనలాంటి 54 మందికి కొత్త జీవితాలు అందించాడు. సెక్యూరిటీ గార్డులుగా, క్లీనర్లుగా పనిచేస్తున్న వారంతా ఒకప్పుడు నేరం చేసిన వారే. కానీ పరి వర్తనతో సమాజం నమ్మకాన్ని తిరిగి పొంది రక్షణ బాధ్యతల్లో ఉంటున్నారు. క్రిమినల్స్ అనే ముద్రను తుడిచిపెట్టేసిన ఈ కొత్త జీవితాలతో వారి వారి కుటుంబాలు తలెత్తుకు తిరుగుతున్నాయి. అక్కారా మరో అడుగు ముందుకేసి నటుడిగా సినీ అవకాశాలు కూడా దక్కించుకుంటున్నాడు. దీనికి జైల్లో ఓ కార్యక్రమమే బీజం వేసింది. జైల్లో ఓ పరివర్తన కార్యక్రమంలో భాగంగా చేసిన నృత్య నాట కంలో అక్కారా ప్రదర్శని చ్చాడు. దానికి అతిథిగా వచ్చిన ఓ దర్శకుడి మెప్పు పొందాడు. ఓపిక పడితే కొంత కాలానికి మామూ లు జీవితం అందు తుందని తోటి ఖైదీల్లో మార్పు తెస్తున్నాడు.





పరివర్తన
సమా

ఏళ్లకు ఏళ్లు ఓ బందీ
ఉంటుంది. మనిషి వి
వెనుక జీవితానికే అల
నేరగాడి నుంచి మళ్లీ
అనిపిస్తుంది. ఇంకా నే
ఇంక్కెడికి అడుగులు
పెట్టుకున్న వాళ్లున్నారు.
కిక్కిరిసిన జైళ్లలో కాస్త
కొత్తగాలి వీస్తుంది.

రమేష్ పొలం గట్టు కొట్లాటలో క్షణికావేశంలో మాధవ్‌ను కొట్టాడు. అక్కడిక్కడే మాధవ్ ప్రాణాలొదిలాడు. రమేష్ ఇది ఊహించలేదు. చంపేంత మనిషి కాదు. కానీ నేరం నేరమే. కఠిన కారాగార శిక్ష పడింది. సత్ప్రవర్తన వల్ల కొంత కాలం ముందే జైలు నుంచి విడుదలయ్యాడు. అప్పటికే మారిన మనిషి ఎన్నో కలలతో, ఆశలతో ఊరిలో అడుగుపెట్టాడు. ఊళ్లో, కుటుంబంలో ఊహించని ఎన్నో మార్పులు అతడిని కలవరపెడతాయి. వీరన్నకు పందెం విషయంలో ప్రాణ స్నేహితుడితో మాటామాటా వస్తుంది. చినికి చినికి గాలి వానై తన్నుకునేంత వరకు పోతుంది. పెనుగులాటలో మిత్రుడు పోతాడు. వీరన్న జైలు జీవితానికి వెళతాడు. విడుదలయ్యాక ఇంటికెళితే సొంత బిడ్డే గుర్తు పట్టక ఎవరని ప్రశ్నిస్తుంది. భార్య జీవచ్ఛవంలా మిగిలుంటుంది. వీడు మారాడో లేడోనని ఆత్మీయులే అనుమానంగా చూస్తే ఇక అంతకన్నా పెద్ద శిక్షేమిటుంటుంది.

ఇలాంటి రమేష్‌లు, వీరన్నలు ఎందరో. కొన్ని రోజులు ఇంట్లోనే గడిపి తిరిగి బజారుకెళితేనే అంతా కొత్తగా అనిపిస్తుంది. అదే జబ్బున పడి కొన్ని నెలల పాటు మంచానికి అతుక్కుని.. తిరిగి ఊరి పనులకు వెళితే ఆ మార్పు అంత తేలిగ్గా అంతేపట్టదు. ఇక సుదీర్ఘ జైలు జీవితం అనుభవించి బయటకు వచ్చిన వారికి మారిన ప్రపంచం గందరగోళంలోకి నెట్టేయడంలో అతిశయోక్తి ఏముంది. అదేదో చెందని కాలానికి ఒక్క ఉదుటున దూకినట్టు అవుతుంది వాళ్ల పరిస్థితి. ఎప్పటికప్పుడు మారే నిత్యజీవిత పోకడలు, అవసరాలు, కొలతలు, కొలమానాలు, డిమాండ్లు, విషయాలతో అమాంతం గుర్తుపట్టలేనంతగా మారిపోతున్న ప్రపంచంలో తాము మనలేమనే భయం కలుగుతుంది. సమాజం వడివడిగా సాగుతున్న రేసు కోర్సులో తమకంటూ ఓ లైన్ లేదనే భావనలో పడిపోతారు. జైల్లో ఉన్నపుడు పత్రికలు, టీవీలు కాస్త కనెక్ట్ చేసి ఉంచినా అదో వర్చువల్ రియాల్టీగానే అనిపిస్తుంది. అందుకే పేరోల్ ద్వారా అప్పుడప్పుడు వాస్తవ ప్రపంచంలోకి పంపుతుంటారు. ఆ కాలాన్ని

చాలామంది కుటుంబం, అతి సన్ని
ప్రపంచం టచ్ అవదు. సొంతూరు
కొన్నయితే, సొంతవారే గుర్తుపట్టలే
స్మార్ట్‌ఫోన్లు వంటివి అత్యవసరంగా
కూడా తెలియని వ్యక్తుల కథనాలు
శిక్షననుభవించి విడుదలయ్యాక మ
కారణాలెన్నో. కుటుంబం మధ్య ఉ
సమాజం ముద్ర చెదరనపుడు అన్నే
పంచుకున్న జైలు గోడలే అక్కున చే
అయితే... వీరిలో కొందరు వాస్తవ
మామూలు జీవితాలకు తిరిగొచ్చి
పెంచుకుంటున్నారు. దానికి జైల్లోనే

దేశంలోని జైళ్లలో సుమారు
వీరిలో చాలా మంది కేసులు ట్రయ
నిరూపితమైనా, కాకున్నా సుదీర్ఘ కా
ప్రధాన సమస్య జామీనిచ్చేవారు లే
వ్యవహారాలు తెలీకపోవడం. జైలు
అత్యావశ్యకమని ఎన్జీవోలు గొంతెత్త
జైలుకెళ్లి వచ్చిన వారిలో పరివర్తన
నేరగాడిగా మారే అవకాశమిచ్చే కా
ఆత్మహత్యలు చేసుకునేవారుంటారు
నేరం చేసిన వ్యక్తిలో పరివర్తన సాధ
జైలు గోడలకే పరిమితం కాకూడదు
ప్రపంచంతో ఎటువంటి ఘర్షణ లే
తీసుకోవాలి. విడుదల తర్వాత సా
అతి ముఖ్యమైన బాధ్యతగా తీసుకో
వేసేందుకు ఇదో మార్గం. రాష్ట్రాన్ని
మారుతుంటాయి. కొన్ని జైళ్లు హిత
తున్నా వాటి సంఖ్య చాలా తక్కువే
మారాలంటే జాతీయ పాలసీని తీస

...జంలో కూడా...

...నాలో శిక్షననుభవించి విడుదలైనవారి పరిస్థితి ఎలా ...దలైనా మనసు ఇంకా ఖైదులోనే ఉంటుంది. గోడల ...టు పడీపడి స్వేచ్ఛను పీల్చడానికి సతమతమవుతుంది. ...మామూలు మనిషిగా మారే ప్రక్రియ ఎంతో అసాధ్యంగా ...గాడనే స్టాంప్ వేస్తూనే ఉంటే మళ్లీ జైలు గూటికే కాక ...డతాయి. వీటన్నింటినీ దాటుకుని జీవితాన్ని గాడిన ...వారి విజయ గాథలైనా సమాజంలో పరివర్తన కలిగిస్తే ...గాలి ఆడుతుంది. మరికొందరికి కనువిప్పు కలిగితే

...తులతోనే గడపటంతో మిగతా ...కే గుర్తుపట్టలేనివారి సందర్భాలు ... సన్నివేశాలెన్నో. ఇంటర్‌నెట్, ...మారిపోతే కనీసం అవెందుకో ...న్నాయి. ఇక నేరం నిరూపితమై ...ళ్లీ జైలు మార్గాన్నే పట్టడానికి ...న్నా ఒంటరి బతుకే అయినపుడు, ...ళ్ల పాటు తమ ఆవేదనను ...ర్చుకునే నేస్తాలుగా తోస్తాయి. ...ప్రపంచానికి కనెక్ట్ అయ్యి ...మాజంలో విలువను ... కసరత్తు చేస్తున్నారు. ... లక్షల మంది ఖైదీలున్నారు. ...ల్స్‌లోనే ఉన్నాయి. నేరం ...లం వాటిల్లో మగ్గిపోతున్నవారి ...పోవడం, కనీసం బెయిల్ ...వ్యవహారాల్లో సంస్కరణలు ...నికి కారణమదే. ఒక్కసారి ...దు కదా అంతకంటే తీవ్ర ...ణాలెన్నో. తీవ్ర ఒంటరితనంతో ... మత్తుకు బానిసలైపోతుంటారు. ...మవ్వాలంటే ప్రభుత్వం పని ... వారు తిరిగి వాస్తవ ...ండా కలిసి పోయేలా చొరవ ...రణ జీవితాన్ని అందివ్వడాన్ని ...ాలి. నేరాల సంఖ్యకు అడ్డుకట్ట ... బట్టి జైళ్ల విధి విధానాలు ...ర కార్యక్రమాలతో ముందుకెళు ... మొత్తం దేశవ్యాప్తంగా తీరు ...కురావాలని 2007లో ఓ డ్రాఫ్ట్ రూపొంది దేశ వ్యవహారాల శాఖకు చేరుకుంది. అమలులోనే ఉదాసీనత కనిపిస్తోంది. అంతకు ముందే 2003లో మోడల్ ప్రిజన్ మాన్యువల్‌ను పోలీసు పరిశోధనాభివృద్ధి బ్యూరో అందించింది. దానిలో ఒక అధ్యాయమంతా కూడా విడుదల అనంతరం తీసుకోవాల్సిన బాధ్యతలు గురించే వుంది.

ఎప్పటికప్పుడు వారి యోగ క్షేమాలు తెలుసుకోవడం, సంక్షేమ శాఖాధికారుల ఆదరువును కల్గించడం, పని, ఉద్యోగం అందిపుచ్చుకోవడంలో సాయపడటం, సమాజంతో కలిసిపోయేందుకు చొరవ తీసుకోవడం, ఒంటరైనవారికి తాత్కాలిక వసతి ఏర్పాటు చేయడం వంటి ఎన్నో విషయాల్ని స్పష్టంగా పేర్కొన్నారు. ఇదే కాదు 1983 ముల్లా కమిటీ రిపోర్ట్ కూడా ఎన్నో అమూల్యమైన సూచనలు చేసినా పరిస్థితుల్లో అంత మార్పు లేదు. పరిస్థితులో చాలా వరకు కేసుల్లో కుటుంబ పెద్ద దిక్కులే ఊచలు లెక్కపెట్టాల్సి రావడంతో కుటుంబాలు ఆగమవుతున్నాయి. సమాజంలో పరివర్తనకు షా, అక్కారాల వంటి వారి అక్కర ఎంతో ఉంది. వారి సంఖ్య జైళ్లలో మగ్గిపోతున్న వారి కంటే ఎక్కువగా ఉంటే అది సమాజానికి పెద్ద ముందడుగు. అది సాధ్యం కావాలంటే ఆయా వ్యక్తుల్లో మార్పే కాదు, వారి కుటుంబాలు, సమాజం, ప్రభుత్వం వైపు నుంచి కూడా పరివర్తన అత్యవసరం. ●

కిల్లర్ .. అడ్వకేట్ అయిన వేళ...

కారాగారవాసం అనంతరం అడ్వ కేటుగా కొత్త జీవితాన్ని ప్రారంభించిన హితేష్ షా తోటి ఖైదీలకు స్ఫూర్తిగా మారాడు. 1992లో కొత్తగా పెళ్లయిన 23 ఏళ్ల హితేష్ బంధువుని చంపి జైలుకెళ్లాడు. కేసు నడుస్తున్నపుడే భార్య వదిలి వెళ్లిపోయింది. అతడి హృదయం బద్దలైంది. కేసు ఫైనలై జీవిత ఖైదు పడి 19 ఏళ్లపాటు శిక్ష అనుభవించాడు. సత్ప్రవర్తన కారణంగా ముందే 2011లో విడుదలయ్యాడు. విడుదలయ్యాక తనదంటూ ఓ కుటుంబం లేక ఓ మిత్రుడిని ఆశ్రయించాడు. నాసిక్ జైలులో తోటి ఖైదీ అయిన అతడి వద్ద మూడు నెలల్ని జైలు జీవితంలో సంపాదించిన 12 వేలతో నెట్టుకొచ్చాడు. స్నేహాలే కాదు జైల్లో ఉన్నప్పుడు ఎన్నో వాస్తవాలు కళ్ల ముందే కదలాడేవి. తర్వాతి బెయిల్ పత్రం కోసం, అప్పీల్ కోసం నిద్ర లేని రాత్రులు గడిపిన వారితో రోజులు, కుటుంబ మిలాఖత్‌లపుడు జడిపట్టిన కన్నీళ్లు, సంభాషణలు కలచి వేసేవి. ఇపుడు షాకు 50 ఏళ్లు నిండాయి. జైలు నుంచి విడుదలయ్యాక అతడి జీవితంలో గొప్ప మార్పును తనకు తానే సాధ్యం చేసుకున్నాడు. అడ్వకేట్‌గా ఐదేళ్లుగా రాణిస్తున్న హితేష్ రెండో పెళ్లి కూడా చేసుకున్నాడు. ఇదంతా ఎలా సాధ్యమైందంటే జైల్లో ఉండగానే రెండు డిగ్రీలను పూర్తి చేశాడు. జైల్లో ఖైదీల సందర్శనకు తరచూ వచ్చే ఎస్ కుడ్లే అనే న్యాయవాదిని ప్రేరణగా తీసుకుని ఆ వృత్తిలో స్థిరపడాలని నిశ్చయించుకున్నాడు. హితేష్ శిక్షననుభవించే కాలంలో తొలిసారి 11 ఏళ్ల తర్వాత 2003లో బయట ప్రపంచంలో పేరోల్‌పై అడుగుపెట్టాడు. ఆనందాతి శయాలతో కొన్నిరోజుల వరకు కన్నీరు తెలీకుండానే ఉబికి వచ్చేది. అప్పటి నుంచి క్రమంగా పేరోల్‌ల మీద బయటకు వచ్చేవాడు. తాను నేర స్వభావం కలవాడిని కాదని నిరూపిం చుకునేందుకు బంధువుల్ని కలిసే ప్రయత్నం చేసేవాడు.

ది గ్రేట్...



కత్తెరల యాత్రలు

హెయిర్ డ్రస్సింగ్ అదేనండి క్షవరం అంటే కాస్ట్లీ కళ విదేశాల్లో. చేయి తిరిగిన హెయిర్ స్టయిలిస్ట్ స్టుడియోకు బారులు తీరేవారు ఒక పక్క.. ఒక్క సారైనా తమ జుట్టు వారి చేతిలో పడితే చాలని ఎదురుచూసేవారు మరో పక్క క్షురకుల్ని తెగ పాపులర్ చేసేస్తుంటారు. డెనీస్ యుషిన్ మాత్రం అలా పాపులర్ కాలేదు. వృత్తితో పాటు ప్రవృత్తితోను స్టార్ స్టేటస్ సంపాదించేశాడు. తనకు ప్రాణమైన బైక్ రైడింగ్, సాహస కార్యాలకు మరో జోడింపు వుంది. అదే ఒంటరిగా ఓ బ్యాక్‌ప్యాక్ వేసుకుని బైక్ మీద ప్రపంచాన్ని చుట్టి రావాలనే కల. మోటోబార్బర్‌గా తానే పేరు తగిలించుకున్నాడు. దాన్నే ప్రపంచం గుర్తించింది. డెనీస్‌కు భార్య బంగారం లాంటి ఆరేళ్ల కూతురు ఉన్నారు. కానీ ఆరేళ్ల పాటు వాళ్లను వదిలేసి ఊర్లు పట్టాడని విమర్శించడానికి లేదు. కుటుంబమే అతడి యాత్రా ఆర్తిని అర్థం చేసుకుని సంచీ సర్దిచ్చింది.

కూతురికి 11 ఏళ్లొచ్చేసరికి తిరిగి ఇంటి ముఖం చూసే డెనీస్‌కు కష్టంగానే నిర్ణయం తోచింది గానీ, ఇప్పుడు కాకపోతే ఇంకెపుడు అనే మాట పదే పదే వేధిస్తూ యాత్రకు కిక్‌స్టార్ట్ చేసేలా తరిమింది. బ్యాక్ ప్యాక్, బైక్ ఓకే మరి తిండి తిప్పలకు డబ్బు ఎలా? ఇంధనం నింపేదెలా? దీనికో ఉపాయాన్ని డెనీస్ ముందే ఆలోచించి పెట్టుకున్నాడు. చేతిలో విద్య వుంటే ఎక్కడైనా నెగ్గుకు రావొచ్చనే మాట మరీ రష్యా వాళ్లు బాగా వాడేస్తారేమో తెలీదు గానీ తన హెయిర్ స్టైలింగ్‌నే నమ్ముకున్నాడు. ఒక్కో రోజు కనీసం ఇద్దరి తలకట్టును తీర్చిదిద్దేసి తన యాత్ర ఉద్దేశం చెప్పేస్తే కూడు, గూడు, ఇంధనానికి ఢోకాలేదని ఫిక్సయ్యాడు. అయితే ఎలాగోలా యాత్ర ముగించేయడానికి బయలుదేరలేదు. థ్రిల్లుండే చోట దిల్లునోళ్లకు క్లీన్ షేవ్ చేయాలనేది లక్ష్యం. గాల్లో ఎగురుతూ, పర్వతం మీదకెక్కుతూ, సముద్రంలో మునుగుతూ, బైక్ మీద రయ్యిన దూసుకుపోతూ ఇలా ఒళ్లు గగుర్పాటు కల్గించే ఫీట్లతో హెయిర్ డ్రెస్సింగ్ చేస్తే గానీ యాత్ర చేసినట్టు కాదు. తానైతే గాటు పెట్టకుండా షేవ్ చేసేయగలడు కానీ, అలా చేయించుకునేందుకు ముందుకొచ్చేదెవరు. మామూలు సెలూన్‌లోనే కత్తెర చెవుల దగ్గర టపటపలాడుతుంటే బిగదీసుకుపోతారు. కత్తి కంఠానికి ఆనగానే కాసేపు గాలిపీల్చడాన్ని మర్చిపోతారు. డెనీస్ కత్తికిక గొంతెవరు పెడతారు, కత్తెరకు తలనెవరిస్తారు. ఇక టూర్‌లో కిక్కేముంటుందని దిగాలు పడ్డ డెనీస్ ఓ ఐడియాను తలపోశాడు.

యాత్రకు ముందుగానే సామాజిక మాధ్యమాల ద్వారా తన ప్లాన్‌ను పరిచాడు. తాను వెళ్లే రూట్లో తన రూట్లో హెయిర్ స్టెయిలింగ్ చేయించుకునే దమ్ములున్నోళ్లు ముందుగా తనకు సమాచారమిస్తే దార్లో వాళ్లని వాలు కొండల మీదో, మంచు పర్వతాల మధ్యో, ఎడారుల్లోనో, సముద్రంలోనో కలుసుకుని డ్రెస్సింగ్ చేసేస్తానని ప్రకటించాడు. పిచ్చెక్కించే... కిక్కిచ్చే... ప్లేస్ మీరు చెబితే కత్తులు పట్టుకుని వాలిపోతానని అడ్రస్ చేశాడు. అంటార్కిటికా, ఆర్కిటిక్‌ల్లాంటి ప్రాంతాలైతే టూర్ ప్లాన్‌ను పక్కన పెట్టి దూసుకొచ్చేస్తానని నోట్ పెట్టాడు. బైక్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుని కత్తులు, కత్తెరలు పాకెట్లను జత చేశాడు. ఎప్పటికప్పుడు ఎలక్ట్రిక్ ట్రిమ్మర్లకు చార్జింగ్ పెట్టుకునేలా పవర్ సాకెట్లను అమర్చాడు. సాధ్యమైనన్ని హెయిర్ కట్స్ చేస్తేనే కానీ బండి కదలదని తెలిసి ప్రచార సరంజామాను తొడిగేశాడు. క్షవరపు గౌనుకు

ఓ క్షురకుడికి తనకిష్టమైన బైక్‌పై దూసుకుపోతూ ప్రపంచాన్ని చుట్టొచ్చేయాలని కల. అదీ గుండెలు గుభేలుమనే సాహసాలతో హెయిర్ డ్రెస్సింగ్ కళను ప్రదర్శించాలనే లక్ష్యం. ఆరేళ్ల పాటు ఇలా ఇంటిని వదిలి ప్రపంచంలో కలసిపోవాలని బైక్ స్టార్ట్ చేశాడు. తొలేడాదే సాహస షేవింగ్‌లతో, వెంట్రుకలు నిక్కబొడుచుకునే కత్తిరింపులతో టూర్‌ను మాంచి కిక్‌స్టార్ట్ చేశాడు. మోటోబార్బర్‌గా పాపులర్ అవుతోన్న రష్యన్ హెయిర్ స్టయిలిస్ట్ డెనీస్ ప్రపంచ యాత్రలో ఓ ఇస్టైల్ ఉంది.

మోటోబార్బర్ అని ప్రింట్ వేసి మరికొందరిని ఆకట్టుకునే ఎత్తుగడల్లాంటివి చాలానే ఉన్నాయి.

కిక్కిచ్చే కటింగ్...!

గతేడాది మే 29న మొదలైన ప్రయాణం అతడి సొంతూరు క్రాస్నోయార్స్క్ సరిహద్దును వేగంగా దాటేసింది. బైకాల్ సాహసాలు దాటాక రూట్ మ్యాపులో వ్లాడివోస్టాక్, జపాన్, కామ్‌చట్కా, అలాస్కా, కెనడా, అమెరికా నుంచి అర్జెంటీనాకు ఉన్న పసిఫిక్ తీరం, అమెరికా అట్లాంటిక్ తీరం, యూరప్, ఆఫ్రికా, ఆసియా, ఆస్ట్రేలియాలు చుట్టాక తిరిగి క్రాస్నోయార్స్క్ చేరుకుంటాడు. ఇప్పటికే మంగోలియా, చైనా, దక్షిణ కొరియా, ఫిలిప్పైన్స్‌లో తన క్షవర విన్యాసాలను చేసి అక్కడి వారినే కాదు

మిగతా ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. క్రియాశీలకంగా ఉన్న ఓ అగ్ని పర్వతం ముఖద్వారం సమీపంలో ఓ వ్యక్తికి షేవింగ్ చేశాడు. న్యూడిస్ట్ బీచ్‌లో కొందరికి క్షవరం చేశాడు. ఎడారుల నుంచి గడ్డకట్టిన సరస్సుల వరకు ఇతడి కత్తెరలకు సీటు అమర్చాయి గానీ ఓ ఫీట్ మాత్రం చాలా ఉద్విగ్నంగా సాగిపోయింది. వేయి అడుగుల ఎత్తు నుంచి కిందకు పారాగ్లైడింగ్ చేసుకుంటూ మరో రష్యన్ అయిన అలెగ్జాండర్ వోర్లోవ్‌కు క్షవరం, క్లీన్ షేవ్ రెండూ చేశాడు డెనీస్. వియత్నాంలో సాగిన ఈ సాహసాన్ని మూడు కెమెరాలతో చిత్రీకరించి యూట్యూబ్‌లో పెట్టేశారు. ఈ వీడియోను చూసినవారు వీరి పిచ్చి పాడుగాను అన్నారు గానీ చివరకు అంతా క్షేమంగా ముగియడంతో చప్పట్లు కొట్టారు. గాలి వేగం ఎప్పుడు ఎలా మారుతుందో తెలీదు. రేజర్ గడ్డం కింద ఉంటే ఎంతో ఇష్టమైన పారాగ్లైడింగ్ కూడా భయంగా అనిపించింది. ముచ్చెమటలు పట్టాయి గానీ ఫర్లేదు కొత్త హెయిర్ స్టయిల్ నాకు నచ్చింది అని అనుభవాన్ని పంచుకున్నాడు వోర్లోవ్. ఇక్కడ తేలిగ్గానే క్షవరం ముగిసింది కానీ, సముద్ర గర్భంలో విన్యాసమే చాలా కష్టంగా తోచిందట డెనీస్‌కు. ఈ సారి ఈ క్షవర విన్యాసానికి ముందుకొచ్చింది కజకిస్తాన్‌కు చెందిన డైవర్ వసిలీయ్ కలష్నికోవ్. సుమారు గంటపాటు ఈ స్టంట్ కొనసాగింది. ఫిలిప్ఫైన్స్‌లోని పాంగ్లావ్ దీవి వద్ద సులు సముద్రం అడుగుకు ఇద్దరూ డైవ్ చేసి అక్కడ హెయిర్ డ్రస్సింగ్ ఫీట్ కోసం తెగ ఇబ్బందులు పడ్డారు. స్థిరంగా నిలిచే



అవకాశం లేకపోవడం.. జుట్టు కదులుతూనే ఉండటంతో ఏ కత్తెర ఎక్కడ పడుతుందో తలకట్టు ఎలా ఉంటుందోనని వసిలీయ్ చాలా సతమతమయ్యాడు. డెనీస్‌కు కూడా నీటి ఒత్తిడి కత్తెరను చకచకలాడించేందుకు కష్టమైంది కానీ పట్టు పట్టి మరీ పంతం సాధించుకున్నాడు. దీన్నీ చిత్రీకరించి ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టేశాడు. వియత్నాం వరదల సమయంలోను నడి రోడ్డుపై వరద ప్రవాహంలోనే ఓ వ్యక్తికి షేవ్ చేసి ముచ్చట తీర్చుకున్నాడు. వీటన్నింటి సమాచారంతో ఎప్పటికప్పుడు తన వెబ్‌సైట్‌ను, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను అప్‌డేట్ చేస్తుండటంతో అవి సంచలనమయ్యాయి. దేశదేశాల నుంచి డెనీస్‌కు బోలెడు ఆహ్వానాలు అందుతున్నాయి. మనదేశం నుంచి కూడా ఢిల్లీ, బెంగళూరుల నుంచి మోటోబార్బర్‌కు వర్తమానాలు అందాయి. ఇలా ఎయిర్‌పోర్ట్‌లో ఓ వ్యక్తికి, బైక్ రైడ్‌లో ఓ అమ్మాయికి, బీచ్‌లో తల తప్ప మిగతా శరీరాన్ని కప్పేసి ఓ అబ్బాయికి, బిల్డింగ్‌పై సన్నటి దూలం వేసి రోడ్డు మీదుగా వేలాడుతూ ఓ కుర్రాడికి కొత్త తలకట్టును గీసేశాడు. ముప్పై ఏళ్ల ఈ బార్బర్‌కు ముప్పై మూడు రకాల విన్యాసాలు సాధ్యమయ్యాయి తొలి ఏడాదిలోనే. వచ్చే ఐదేళ్లలో ఇంకెన్ని విన్యాసాలతో చెలరేగిపోతాడో.

మరో కత్తెర ...

డెనీస్‌లా వింత యాత్ర కాదు గానీ లండన్ కుర్ర బార్బర్ మిగైయిల్ గుటీర్రెజ్ కూడా ప్రపంచ యాత్ర తన కత్తెరపై నడిపించేస్తున్నాడు. గుటీర్రెజ్ సామాన్య హెయిర్ స్టయిలిస్ట్ కాదండోయ్ లండన్ ఫ్యాషన్ వీక్‌లో తన కత్తెర మెరుపులతో సూపర్ మోడళ్లకు అందాన్ని అద్దాడు. యాత్రకు రెండేళ్ల క్రితమే స్కెచ్ వేసుకున్నాడు. ఏడాదిలో 5 ఖండాల్ని తన వృత్తితో తిరిగి రావడమే లక్ష్యం. అయితే మిగైయిల్ యాత్ర వెనుక భారీ పథకమే ఉందిలెండి. ప్రపంచవ్యాప్తంగా క్షుర విద్యలో రహస్యాలు, కిటుకులు, మెళుకువలు పట్టేయాలనేది అసలు కారణం. మారుమూల ప్రాంతాలు, పర్వత ప్రదేశాలకు వెళ్లి పాత టెక్నిక్‌ల పనిపట్టాడు.

2013లో 'ది నొమాడ్ బార్బర్' (సంచార క్షురకుడు)గా పేరు తగిలించుకుని యాత్ర చేపట్టాడు. దీని కోసం 9 నెలల పాటు ప్లాన్ వేసుకున్నాడు. పదుల కొద్దీ క్రెడిట్ కార్డులను తీసుకున్నాడు. ఓ స్పాన్సర్ సాయంతో వెంట ఓ కెమెరామెన్‌ను కూడా తీసుకెళ్లాడు. భారీ కిక్‌స్టార్టర్ క్యాంపెయిన్‌ను అమలు చేశాడు. తాను వెళ్లే ప్రాంతాల్లో ఉన్న క్షురకులకు ముందుగానే సమాచారం చేరవేసి వారి వద్ద కొన్ని గంటలలో, రోజులో పని చేసేలా షెడ్యూల్ వేసుకున్నాడు. కొందరి దగ్గర అకస్మాత్తుగా శిష్యరికం మొదలెట్టేశాడు. తన అనుభవాల్ని చిత్రీకరించి



యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టేశాడు. అవి పెద్ద హిట్ అయ్యాయి. డెనీస్‌లా సాహసాలు లేకపోయినా ఇతడు తన స్టయిల్ చూపాడు. న్యూజిల్యాండ్‌లోని ఓ సరస్సు దగ్గర, దుబాయ్ ఆకాశహర్మ్యం రూఫ్‌టాప్‌పై, వారణాసిలో ఓ పడవలో, సిడ్నీ ఒపెరా హౌజ్ ముందు తన విద్య ప్రదర్శించాడు. చిలీ, టర్కీలతో పాటు భారత్‌లో కూడా క్షవర విద్యలో టెక్నిక్‌లను పట్టేశాడు. బోడిగుండు చేశాక తల మర్దన ఎలా చేస్తే కస్టమర్‌కు ఫేవరెట్ బార్బర్ అవుతారనే విషయాన్ని మన క్షురకులే తల పట్టి పట్టి నేర్పించారట. అదే కాదు సొంతింటి కష్టాలు, బాస్‌ల ఎఫైర్లు, తమ వింత కోర్కెల వంటి ప్రతి రహస్యాన్ని కస్టమర్ బార్బర్‌కు చెప్పుకుంటాడని, ఇల్లు కట్టుకోవడం దగ్గర నుంచి కూతురి పెళ్లి కబుర్లు కూడా పూసగుచ్చినట్టు చెబుతారని.. తగిన సందర్భాల్లో సలహాలు, సూచనలతో బార్బర్లు కస్టమర్లకు కష్ట సమయంలో మరింత దగ్గరవుతారని, ఎట్టి పరిస్థితుల్లోను రహస్యాలను మరొకరితో చెప్పకుండా రిలేషన్‌ను పదిలం చేసుకుంటారనే విషయాల్ని బాగా నేర్చుకున్నాడట కూడా. గ్రీస్, బల్గేరియా, కుర్దిస్తాన్, యూఏఈ, నేపాల్, హాంకాంగ్, వియత్నాం, కాంబోడియా, థాయ్‌ల్యాండ్, మలేసియా, సింగపూర్, వియత్నాం, లావోస్, ఇండోనేషియా, ఆస్ట్రేలియా, అమెరికా, పెరూ, చిలీ ఇలా చెప్పుకుంటూ పోతే మిగైయిల్ చుట్టొచ్చిన దేశాల లిస్టు చాలానే ఉంటుంది. 2014 ఏప్రిల్ నాటికి తొలి దశ పూర్తిచేసుకునే సరికి డబ్బులు అయిపోయాయి. అందుకే కొన్ని రోజులాగి మళ్లీ యూరప్‌లో కలియతిరగడం మొదలెట్టాడు.

✦

వింత లోకం

మూగజీవాలకు అంకితం

చైనాకు చెందిన వైద్యురాలు వెంగ్ గ్నియావోపింగ్ రిటైరయ్యాక అందరిలా సేద దీరడంలేదు. ఆమె ఓ పెద్ద పనిని తలకెత్తుకుంది. మాంసం కోసం వధించే కుక్కల్ని, పిల్లుల్ని కాపాడి వాటికో సంరక్షణ కేంద్రాన్ని నడుపుతోంది.

అనారోగ్యంతో ఉన్నవి, వదిలేసిన పెంపుడు జంతువుల్ని కూడా సంరక్షిస్తోంది. తన ఆస్తుపాస్తులన్నింటినీ అమ్మేసి దాదాపు కోటి ఎనభై లక్షల రూపాయల్ని పోగేసి మూగ జీవాలకు హ్యూయ్‌ఝౌ నగరం సమీపంలోని తైపింగ్‌క్వియావో గ్రామంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కేంద్రంలోని జంతువుల కడుపు చల్లగా ఉండాలంటే రోజుకు యాభై కేజీల అన్నం ఉడకాలి.

పిల్ల పిల్లులు

నార్వేలోని వోస్లోలో ఓ పిల్ల పిల్లి ఉంది. పిల్లి పిల్ల కాదు.. పిల్ల పిల్లే. మరేంటండి మరి తనలో ఓ పిల్లి బంధించబడి ఉందని, అనుకోకుండా ఇలా మనిషిలా పుట్టేశానని తెగ బాధపడిపోతుందా పిల్ల. పేరు నానో, వయసు ఇరవై. ఇదేం వెర్రనంటే మియ్యావ్ అని మీద పడిపోతుంది. నువ్వు చిన్నప్పటి నుంచి ఇంతేనా అంటే అవునంటూ కృత్రిమంగా పెట్టుకున్న తోక ఊపుతోంది. పిల్లి చెవుల టోపీని రిక్కిస్తోంది. ఈ పిల్లతోనే వేగలేకపోతున్న కుటుంబానికి ఆమె బాయ్‌ఫ్రెండ్ స్వియన్ రూపంలో మరో తలనొప్పి తయారైంది. వాడేమో నేను మనిషినే గానీ పిల్లి పర్సనాలిటీ కూడా అప్పుడప్పుడు బయటకొస్తుందని అపరిచితుడు ఏషాలేస్తున్నాడు. వీరిద్దరు ఓ చోటుంటే వీళ్ల పిచ్చేమో గానీ చూసినవాళ్లు పిచ్చెక్కి పరిగెడుతున్నారు. నీకు నైట్ విజన్ లాంటిదేం లేదు, ఆ ఆలోచన నుంచి బయటపడమని సైకాలజిస్టులు బుజ్జగిస్తున్నా వినడంలేదు. కావాలంటే రాత్రుళ్లు చీకటిలో ఎలుకల్ని పట్టేస్తానంటోంది. వెర్రి వెయ్యి రకాలు మరి!

ఫర్నిచర్‌ను పెంచి..

చెట్లని నరికి కలపతో ఫర్నిచర్ చేయడమనే పద్ధతి యూకేకు చెందిన డిజైనర్ గావిన్ మన్రోకు అస్సలు నచ్చలేదు. దానికి బదులు చెట్లనే ఫర్నిచర్ ఆకృతిలో పెంచేస్తే? అనే ఆలోచన చేశాడు. చేయడమే కాదు ఇలా ఫైబర్ మాతృకల్లో వాటిని బెండ్ చేసేసి కుర్చీలు, టేబుళ్లుగా పెంచేస్తున్నాడు. ఈ ఐడియా ఎలా తట్టిందంటే చిన్నప్పుడు తమ ఇంట్లో ఓ బొన్సాయ్ చెట్టు ఉండేది. వాళ్ల అమ్మ దాన్ని తీర్చిదిద్దింది. ఎలా అంటే అది ఓ బెడ్ ల్యాంప్ ఆకృతిలోకి వచ్చింది. అదో చెరగని ముద్ర వేసేసింది. ఆ మధ్య కాలిఫోర్నియాలో కొన్నాళ్లు గార్డెనర్‌గాను పనిచేసిన గావిన్ మొక్కల ఆకృతుల్ని తీర్చిదిద్దడంలో తల్లిని మించిన వాడయ్యాడు. 'ఫుల్ గ్రోన్' పేరిట కంపెనీ మొదలెట్టేసి ఇలా ఫర్నిచర్ ఆకృతిలో చెట్లను పెంచడాన్ని పెద్ద ఎత్తున చేపట్టాడు.

కలలాంటి ప్రేమ-పెళ్లి

ఎరికా హ్యారిస్‌ది కాలిఫోర్నియా. ఆర్టె వాన్‌ది న్యూయార్క్. నేరుగా చూడకుండానే ప్రేమించుకున్న ఈ జంట ఎయిర్‌పోర్ట్‌లో తొలిసారిగా కలిసిన వెంటనే పెళ్లిచేసేసుకున్నారు. ఓ సామాజిక మాధ్యమంలో ఆర్టెను చూసిన ఎరికా అతడు నచ్చడంతో ఏడాది పాటు అతణ్ని గమనించింది. ఎలాంటి పోస్టులు చేస్తున్నాడో, అమ్మాయిల పోస్టులకు ఏం కామెంట్లు చేస్తున్నాడో జాగ్రత్తగా ఫాలోఅవుతోంది. తన ఫొటోల్ని అప్పుడప్పుడూ లైక్‌లు కొడుతున్న ఎరికాను గమనించిన వాన్ ఎరికాను ట్యాగ్ చేసి ఆమె ఫ్రెండ్ చేసేసుకున్నాడు. కొన్నాళ్లకు ఒకరి గురించి ఒకరు పూర్తిగా తెలుసుకోవాలని నంబర్లు ఇచ్చిపుచ్చుకున్నారు. తొలిరోజే దాదాపు 7 గంటలపాటు ఫోన్ కట్ చేయకుండా మాట్లాడేశారు. అది దాటి ఇరు కుటుంబాలతోను బాగా కనెక్ట్ అయిపోయారు. ఎంతగా అంటే ఎరికా కొడుకులు రోజూ ఆర్టెతో మాట్లాడితే గానీ నిద్రపోయేవారు కాదు. ఆర్టె తల్లి గుడ్‌మార్నింగ్ అంటూ ఎరికా పలకరింపును రోజూ వినాల్సిందే. ముగ్గురు బిడ్డల ఒంటరి తల్లి అయిన ఎరికా ఈ కొత్త బంధం ఏమౌతుందోనని కంగారుపడింది. ఆర్టెకు అంతకు ముందు వివాహ బంధం ఎపుడో తెగిపోయింది. ఇద్దరూ గృహ హింస బాధితులే, వివాహంపై నమ్మకం కోల్పోయినవారే. ఇదే కాదు ఇద్దరూ పెళ్లి చేసుకోవడానికి మరో అడ్డంకి దూరాభారాలు. ఎవరో ఒకరు ఉన్న ఊరును, స్థిరపడిన కెరీర్‌ను వదులుకోవాలి. ఆ మహానగరాల్లో అదంత ఆషామాషి విషయం కాదు. కానీ రోజురోజుకీ బలపడిపోతున్న ఈ బంధం నుంచి ఎలా తప్పించుకోవాలో తెలీక ఓ రోజు మాట్లాడుకుని ఇక గుడ్‌బై చెప్పేసుకున్నారు. పాత సోషల్ అకౌంట్లు, ఫోన్ నంబర్లు మార్చేసుకుని కొత్తవాటికి మారారు. నెలలు గడిచాయి. ఎరికా వాన్‌తో డిస్‌కనెక్ట్ అయ్యి ఉండలేకపోయింది. తానే మళ్లీ సామాజిక మాధ్యమంలో వాన్‌ను పలకరించింది. కానీ అదే సమయంలో వాన్‌కు యాక్సిడెంటై ఆస్పత్రి పాలవడంతో కొన్నివారాలకు గానీ రెస్పాండ్ కాలేకపోయాడు. ఈ పరీక్షలన్నీ దాటాక ఇక బలంగా నిశ్చయించుకున్నారు ఒక్కటవ్వాల్సిందేనని. అప్పటి వరకు ఒకర్నొకరు నేరుగా చూసుకోలేదు.



కానీ కలిసిన వెంటనే పెళ్లని, ఒంటారియో ఎయిర్‌పోర్ట్ వేదికని అక్కడి మీడియాకు కబురంపారు. వాన్ న్యూయార్క్ ఉద్యోగాన్ని వీడి కాలిఫోర్నియాలో ఎరికా కుటుంబంతో కలిసి ఉండేందుకు నిర్ణయం తీసుకుని బయలుదేరాడు. ఇద్దరూ ఎయిర్‌పోర్టులో ఒకరికొకరు ఎదురవగానే చెప్పలేనంత ఆనందంలో మాట పెగల్లేదు. ధార పట్టిన కన్నీటిని అదుముకుంటూ రింగ్ తొడిగేసి వాన్ ఎరికాను పెళ్లిచేసుకున్నాడు. ఇదంతా న్యూస్ చానల్లో ప్రసారమై వాన్ తల్లి లైవ్‌లో చూడగలిగింది. అటు నుంచి అటే పారిపోతున్నామంటూ ఆమెకు కెమెరా ముందు సరదాగా చెప్పేసి హనీమూన్‌కు చెక్కేసిందా జంట.

కువైట్ కబుర్లు

కువైట్ కబుర్లు, సయ్యద్ నశీర్ అహమ్మద్,
పేజీలు: 126,
ధర: రూ.40/-,
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తకాలయాలు.

అరబ్బు ద్వీపాలలో కువైట్ ఒకటి. ఇక్కడ నివాసం వుంటున్న ఇతర దేశాల వారికి మతపరంగా, సామాజిక పరంగా, ఆర్థిక పరంగా అన్ని విధాల స్వేచ్ఛ ఉంది. స్థానికుల కంటే కూడా ఇతర దేశస్తులు ఇక్కడ పెద్ద సంఖ్యలో ఉన్నారు. 1950కు ముందు నుంచే భారతీయులు కువైట్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం సుమారుగా ఏడున్నర లక్షల మంది భారతీయులు కువైట్‌లో నివాసముంటున్నారు. వారిలో 2 లక్షల మంది ఆంధ్రప్రదేశ్ వాసులు ఉండగా, అందులోనూ లక్ష మంది కడప జిల్లా వారవటం విశేషం. కువైట్ ఒక చిన్న సుందరమైన దేశం. ఈ దేశవాసులు విశాల హృదయులు, పరమత సహనశీలురు. ప్రాంతం, వర్ణం, వంశం, మతం, ప్రాతిపదికపై అక్కడ 2015 సంవత్సరంలో 66వ భారత గణతంత్ర దినోత్సవంతో పాటు కడప సొసైటీ 30 వసంతాల వేడుకలు కూడా జరుపుకుంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ మేడా మల్లికార్జున్ రెడ్డి (ఎం.ఎల్.ఏ. రాజంపేట), గౌరవ అతిథిగా ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్ ఆహ్వానం అందుకున్నారు. కువైట్ ప్రయాణ సంగతులను సయ్యద్ నశీర్ అహమ్మద్ రాసుకున్నారు. స్వదేశానికి వచ్చిన తరువాత ఆ విశేషాలను మరింత వివరంగా ఒక పుస్తక రూపంలోకి తీసుకొచ్చారు. ఆ పుస్తకాన్ని ఆల్ ఫారూఖ్ పబ్లికేషన్స్, కడప వారు "కువైట్ కబుర్లు"గా తీసుకొచ్చారు.

నల్ల కలువ మీద నక్షత్ర కాంతి

నల్ల కలువలు నక్షత్రాలు,
ఎస్.వి.రామశాస్త్రి, పేజీలు: 68, ధర: రు 70/-,
ప్రతులకు: ఎస్.ఎస్.శైలజ, సిండికేట్ బ్యాంక్, గామిని కాంపౌండ్, ఆర్.పి.రోడ్, తణుకు-534 211, ప.గో, ఆంధ్రప్రదేశ్.



ఎస్.వి రామశాస్త్రి, కవియే కాకుండా, చిత్రకారులు కూడా. చిత్రకారుల మనస్సెప్పుడూ సౌందర్య ప్రధానంగా ఉంటుంది. ప్రకృతిపరంగా ఉంటుంది. మృదు స్వభావం కలిగి ఉంటుంది. సామాజిక వస్తువును తీసుకున్నా, ఒప్పించేటట్లు చెప్పే నైపుణ్యం ఉంటుంది. అంతేగాక మూలతత్వాన్ని గ్రహించే తత్వం కూడా ఉంటుంది. వారు కవిత్వం రాసినా, అందులో ఇలాంటి లక్షణాలన్నీ దృశ్యమానంగానే ఉంటై, అటువంటి రామశాస్త్రి ఇప్పుడు "నల్ల కలువలూ-నక్షత్రాలు" అనే కవితా సంపుటి. తెస్తున్నారు. ఇందులో నల్లకలువల సౌందర్యమూ ఉంది. నక్షత్రాల వెలుగూ ఉంది. నల్లకలువలు - మెత్తని మురిపాలు విరజిమ్ముతై. నక్షత్రాలు చీకటిని గూడా చీల్చి తమ శక్తిని నిరిపిస్తై రామశాస్త్రి కవితల్లో మెత్తదనమూ ఉంది. చీకటి తొలగించే లక్షణమూ ఉంది. ఒక వస్తువుని తాత్వికంగా పరిశీలించే స్వభావమూ ఉంది.

మనసు పాటల పుస్తకం

తెలుగు చలన చిత్ర రంగంలో ఉత్తమ గేయ రచయితలు ఒకరిని మించి ఒకరు... ఒకరి తర్వాత ఒకరు సుసంపన్నం చేస్తూ వచ్చారు. సముద్రాల సీనియర్, సముద్రాల జూనియర్ తర్వాత మనకు బాగా పరిచయమైన పేర్లు మల్లాది రామకృష్ణ శాస్త్రి, ఆత్రేయ, దేవులపల్లి, ఆరుద్ర, దాశరథి, శ్రీశ్రీ, సినారె. వీరిలో ఆత్రేయ 'మనసు కవి'గా ప్రసిద్ధుడయ్యారు. ఆయన అసంఖ్యాకంగా రాసిన మనసు పాటల్లోని సొగసును 'మానసోల్లాస వ్యాఖ్య'గా మనకు అందిస్తున్నారు శ్రీనివాస గాంధీ. కవి ఎంతటి సహృదయుడో పాఠకుడు అంతటి సహృదయు డయినప్పుడే, అది రసానుభూతిని కల్గిస్తుంది. - స్నేహ

ఆత్రేయ మనసు పాటల సొగసు
పేజీలు: 136/-
ధర: రూ. 100/-,
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తకాలయాలు.



కొత్త పుస్తకాలు

రామాయణం
కల్పితకథ
రచయిత: డాక్టరు దొప్పలపూడి మల్లిఖార్జునరావు
వెల : 50/-
పేజీలు : 109/-
ప్రతులకు : చార్లెస్ డార్విన్ గార్డెన్స్ ట్రస్ట్ విజయలక్ష్మీపురం- బాపట్ల

నా కేరళ పర్యటన..
రచయిత: డా॥డి. మల్లిఖార్జున రావు
వెల: 50/-
పేజీలు : 78/-
ప్రతులకు : చార్లెస్ డార్విన్ గార్డెన్స్ ట్రస్ట్ విజయలక్ష్మీపురం- బాపట్ల

ముస్లిం పర్సనల్ లా
కొన్ని అపార్థాలు
మూలం: మౌలానా ఖాలిద్ సైపుల్లాహ్ రహ్మానీ
అనువాదం: ముహమ్మద్ యాకూబ్
వెల : 40/-
పేజీలు : 104/-
ప్రతులకు : అల్ ఫారూఖ్ పబ్లికేషన్స్ 22/373, మస్తాన్ వలి స్ట్రీట్ కడప

గుడిసె గుండె
రచయిత: దేవరాజు మహారాజు
వెల : 60/-
పేజీలు : 66/-
ప్రతులకు: అన్ని ప్రముఖ షాపుల్లో లభించును

Human Evolved From Chimpanzee

Written by : Dr Doppalapudi Mallikarjuna Rao
printers : sree lakshmi press-bapatla

◆ కథ



మాతృదేవోభవ

శైలజ
-944024759

అప్పటికి మధ్యాహ్నం పన్నెండు గంటలయ్యింది. ఇంతలో వెక్కి వెక్కి ఏడుస్తూ ఓ అమ్మాయి ఒ.పి. రూమ్‌లోకి వచ్చింది. "ఏమ్మా? ఎందుకలా ఏడుస్తున్నావ్. నాల్గు నెలల్లో పండంటి బిడ్డను కంటావని పోయిన సారి చెప్పానుగా! భయపడకు" అంటూ ధైర్యం చెప్పింది డాక్టర్ మమత. "లేదు డాక్టరమ్మా! ఈ బిడ్డ కడుపులో పడిన దగ్గర నుండి నాకు చాలా కంగారుగా ఉంది. మా అత్తమామలు, భర్త అందరికీ మగ బిడ్డే కావాలి. ఆడ బిడ్డ పుడితే పుట్టింట్లో దించేస్తారట. పుట్టింట్లో నా తర్వాత ఇద్దరు ఆడపిల్లలున్నారు. వాళ్ళు నన్నింకా ఏం భరిస్తారు? ఏం చేయాలో తెలియటం లేదు. కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్రా లేవు. కడుపులో బిడ్డ కదలికలు ఆనందం కల్గించటం లేదు. పుట్టేది మగ బిడ్డో కాదో తెలుసుకు రమ్మని ఒకటే పోరమ్మా! ఆ పరీక్ష మీరు చెయ్యనన్నారని బాగా కోపంగా వున్నారు ఇంటిల్లిపాదీ. ఇంటికెళ్లాలంటే భయంగా వుంది." అని ఏడుస్తూ చెప్పింది ఆ అమ్మాయి.

"తల్లీ! నువ్వు నా చెల్లెల్లాంటి దానివి. జాగ్రత్తగా నే చెప్పింది విను. నువ్వు డెలివరీ అయ్యేదాకా ఏ దిగులూ పెట్టుకోకు. లోపలున్న బిడ్డ ఎవరైనా, నీవు ఆహారం సరిగ్గా తీసుకోకపోతే తర్వాత బాధపడేది నువ్వే. ఎవరు పుట్టినా భయపడాల్సిందేం లేదు. మగబిడ్డ పుడితే నీకక్కడ కొంత బాధ తప్పుతుంది. అదే ఆడబిడ్డ పుడితే మొత్తం బాధే తప్పుతుంది." అంది మమత. ఆ మాటలకు ఆమె ఆశ్చర్యంతో 'అదెలాగ?' అని అడిగింది. "ఆడపిల్ల పుడితే నిన్ను పుట్టింటికి పొమ్మన్నారన్నావుగా! అప్పుడు నీకు పుట్టిల్లు ఈ ఆస్పత్రే అవుతుంది. నీకు ఇక్కడ ఏదో ఒక పని ఇస్తాను. నెల నెలా జీతం కూడా ఇస్తాను. నీ భర్త ఆ డబ్బు కోసమైనా నిన్ను చేరదీస్తాడు కదా! అప్పుడు పరిస్థితి నీ చేతుల్లో ఉంటుంది. మెల్లిగా కాపురాన్ని చక్కదిద్దుకోవచ్చు ఏమంటావ్!" అంది మమత. డాక్టర్ చేతులు పట్టుకుని ఆమె ఏడుస్తూ "ఇంక దేనికీ భయపడను. నాకు కొండంత అండగా మీరున్నారు." అంది. "వచ్చే నెల్లో చూపించుకోడానికి వచ్చేప్పుడు మీ ఆయన్ను కూడా నీతో తీసుకురా! నచ్చచెప్తాను. ఇదిగో ఈ టానిక్ తాగాలి. ఇక జాగ్రత్తగా వెళ్ళిరా." అంటూ ఆమెను పంపించింది. కొంచెం రిలాక్సయి మిగతా పేషెంట్లను చూసి ఇంటికెళ్లింది మమత.

ఇంటికెళ్లేసరికి మధ్యాహ్నం 2:30 కావడంతో తలుపు తీస్తూనే ఓ పెద్దావిడ "తల్లీ ఇవాళ లేటయ్యిందేం?" అనడిగింది. "ఒక పేషెంట్‌తో మాట్లాడుతూ కూర్చున్నాను పిన్నిగారూ. ఇంకా మూడు నెలల్లో ఆమెకు ప్రసవం. కానీ తల్లినవుతున్నానన్న సంతోషం ఆమె ముఖంలో మచ్చుక్కి కూడా కనపడలేదు." అని ఆ పేషెంట్ ఇంటి పరిస్థితులు, తానన్న మాటలు చెప్పింది. అవి వింటూనే ఆ పెద్దావిడ తన విషయం గుర్తుకు తెచ్చుకుంది. ఆమె ఓసారి తన కూతుర్ని పరీక్ష చెయ్యించాలని మమత దగ్గరికి తీసుకొచ్చింది. పిల్లలింకా పుట్టలేదని అత్త, భర్త గొడ్రాలని తిడుతున్నారని వాపోయింది. ఆ అమ్మాయికి పరీక్షలవీ చేసి ఆమె భర్తను ఆస్పత్రికి పిలిపించమని చెప్పింది మమత. వేరే డాక్టరు చేత అతనికి రహస్యంగా పరీక్షలు చేయిస్తే లోపం అతనిలో వుందని తేలింది. దాంతో అతను భార్యకి క్షమాపణ చెప్పాడు. మంచి ట్రీట్‌మెంట్ ఇప్పించటంతో ఈ మధ్యనే ఆ అమ్మాయికి కడుపు పండింది. ఒంటరిగా ఉండే ఆ పెద్దావిడ అప్పటి నుండి మమతకి సాయంగా ఇంటి పనులు చూస్తూ ఆమె వద్దే ఉంటోంది.

వీరి మాటల మధ్యలో మమత భర్త రాఘవ వచ్చాడు. ఇద్దరికీ భోజనం వడ్డించింది పెద్దావిడ. "మీ కేసు ఎంత వరకూ వచ్చింది?" భర్తనడిగింది మమత. ఆధారాలు ఎక్కువ లేవు. వెతుకుతున్నాను" అన్నాడు. అతనో అడ్వకేట్. వీళ్ళకి శ్రీకాంత్ ఒక్కడే కొడుకు. ఎనిమిదో తరగతి చదువుతున్నాడు.

"మమతా! నీకీరోజు కేస్‌లు లేవా? తీరిగ్గా వున్నావ్?" అడిగాడు రాఘవ. "లేదండీ! రాత్రికి ఓ డెలివరీ కేస్ అటెండ్ కావాలి. మధ్యాహ్నం ఒ.పి. శేఖర్ ఉన్నారుగా, ఆయన చూస్తారు." అంది. సరే నేను వెళ్ళొస్తా అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు రాఘవ. "పిన్నిగారూ నేను హాస్పిటల్‌కి వెళ్ళాక ఏమైనా ఫోన్లు వచ్చాయా?" అని అడిగింది మమత. "ఆ! మీ మామగారు చేశారమ్మా! తంజావూరు నుండి. అంతా బాగానే ఉన్నారట. ఇంకో పది రోజులయ్యాక గానీ రారట. మిమ్మల్ని ఓ సారి ఫోన్ చెయ్యమన్నారు." అంది పిన్నిగారు. సరేనండీ నేను కాస్త రిలాక్స్ అవుతాను.. అంటూ మమత లోపలికి వెళ్ళింది. "ఎంత గొప్ప మనసు మమతమ్మది! ఈ తల్లి వల్ల ఎందరాడ బిడ్డల జీవితాలు బాగుపడుతున్నాయో. మా అల్లుడి లాంటి కోపిష్టి మనిషి, ఈ తల్లి మాటల మంత్రంతో శాంత మూర్తిగా మారిపోయాడు." అంటూ పిన్నిగారు స్వగతంలోకి వెళ్ళిపోయారు.

సాయంత్రం 4 గంటలయ్యింది. శ్రీకాంత్ స్కూలు నుండి వచ్చాడు. రాఘవకి కొడుకుని గొప్ప రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివించాలనుంది కానీ మమతకది నచ్చలేదు. అక్కడ బాగా చదువొస్తుంది కానీ ఒంటరితనంతో అంతర్ముఖులవుతారు. బాహ్య ప్రపంచం, కలివిడితనం తెలియవు.. అని వాదించి ఇంటి నుంచే స్కూల్‌కు పంపుతోంది. శ్రీకాంత్ కూడా తల్లి ఆలోచనలకు తగ్గట్టుగానే పెరుగుతున్నాడు. అతను వచ్చీ రావడంతోనే "అమ్మా! ఎల్లుండి వరంగల్ ఎక్స్‌కర్షన్‌కి మమ్మల్ని స్కూలు వాళ్ళు తీసుకెళుతున్నారు వెళ్ళనా?" అనడిగాడు. "ఎంత గొప్ప ప్రాంతానికి వెళుతున్నారు! తప్పకుండా వెళ్ళు" అంటూ కాకతీయుల చరిత్ర, వేయి స్థంభాల గుడి గురించి మొత్తం శ్రీకాంత్‌కి కథలా చెప్పింది. దాంతో శ్రీకాంత్‌కి ఉత్సాహమొచ్చింది. "ఓ డైరీలో అన్నీ నోట్ చేసుకో! తాతగారికి బామ్మకి అందరికీ విశేషాలు చెప్పవచ్చు" అంది. ఓ కెమేరా కూడా తీసి ఇచ్చింది. "పిన్నిగారూ! శ్రీకాంత్ ఎల్లుండి వరంగల్ వెళుతున్నాడు స్కూలు పిల్లలతో. నాకెంత ఆనందంగా వుందో తెల్సా! నేను అక్కడే మెడికల్ కాలేజీలో చదువుకున్నాను. అప్పుడెంతో ఉత్సాహంగా మూడేళ్ళ గడిచిపోయాయి." అంటూ ఓ క్షణం మౌనమై నిదానంగా నాలుగో సంవత్సరం మాత్రం అంటూ.. ఆగిపోయింది. దానికి కారణం మమత మిత్రురాలిని తోటి విద్యార్థే ప్రేమించాలని వేధిస్తూ యాసిడ్ దాడి చేశాడు. మిత్రురాలిది పేద కుటుంబం కావడంతో డబ్బున్న ఆ యువకుడికి వ్యతిరేకంగా మమత వాళ్ళ కుటుంబమే పోరాడింది. అది చూసే పబ్లిక్ ప్రాసిక్యూటర్ అయిన రాఘవ తండ్రి మమత సాహసాన్ని మెచ్చి కోడలిగా తెచ్చుకున్నాడు.

శ్రీకాంత్ ఎక్స్‌కర్షన్‌కి వెళ్ళిన తర్వాతి రోజు ఉదయం మమత రాఘవ రోజూలానే మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. తిరిగొస్తుంటే ఒక చోట సన్నగా మూలుగు ఏదో (దెబ్బలు తగిలి లేవలేక బాధపడుతున్నట్లు) వినిపించింది. ఇద్దరూ చుట్టూ చూశారు. చెట్ల వెనకాల ఓ పాప ఒళ్ళంతా రక్తంతో పడి వుంది. వెంటనే రాఘవ ఆటో పిలిచి హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. పాపను పరీక్షించి అత్యాచారానికి గురైందని తెల్సుకుంది మమత. రాఘవకి ఈ విషయం చెప్పి ఎవరికీ తెలీకుండా రహస్యంగా వుంచమని కోరింది. చికిత్సతో పాప కోలుకుంది. మూడో రోజు నర్సు మాట్లాడిస్తే అమ్మ కావాలంటూ ఏడవసాగింది. బుజ్జగించినా ఊరుకోవటంలేదు. ఈ లోగా మమత వచ్చి ఏమైంది సిస్టర్? అనడిగింది. "అమ్మ కావాలిట! ఎంత చెప్పినా వినటం లేదు డాక్టర్." అంది నర్స్. "సరే నువ్వెళ్ళి పాలు తీసుకురా." అని పాపతో మాటలు కలిపింది మమత. "పాపా! నీ పేరేమిటి? చెప్పు? నీకు 'యాక్సిడెంట్' అయ్యింది. దెబ్బలు బాగా తగిలాయి. పార్కులో కనిపిస్తే మేమే ఇక్కడకు తీసుకొచ్చాం. మీ అమ్మావాళ్లు ఎక్కడ వుంటారో చెప్తే మేము తీసుకొస్తాం. నీకు పూర్తిగా తగ్గాక మీ అమ్మ దగ్గరకి వెళ్ళిపోదువు గాని.." అంది మమత. కాస్త నెమ్మదించిన పాప మెల్లిగా "మా స్కూలు తెలుసు, సార్ పేరు తెలుసు. చెరువు దగ్గర మా ఇల్లు, రామారావు సార్." అని చెప్పింది. "సరే నీకు స్నేహితులున్నారా?" "ఆ.. కమల నేను బాగా ఆడుకుంటాం.." ఇలా కబుర్లు చెప్తూ పాలు తాగించి మందులు వేసింది. నర్సొచ్చి పాపకి తలదువ్వి మంచి బట్టలేసింది. ఇంతలో మమత కారు డ్రైవర్‌ని పిలిచి పాప చెప్పిన స్కూలు, టీచర్ పేరు చెప్పి ఆయన్ను వెంటబెట్టుకుని రమ్మని చెప్పింది. ఓ గంటలో ఆ సార్ వచ్చారు. నర్సు పాపనుంచిన రూమ్‌లోకి తీసుకెళ్ళింది. పాపను గుర్తుపట్టి 'హా.. 'గంగ" అని పెద్దగా అని, గంగకేమైందంటూ నర్సును కంగారుగా అడిగారు.

మమత రూమ్‌లోకి ఆయన్ను నర్సు తీసుకెళ్లింది. "క్షమించాలి. మనసును కష్టపెట్టే విషయం చెప్పబోతున్నాను. పాప రేప్‌కి గురైంది. నేను టెస్ట్‌లన్నీ చేశాను. పాప చిన్నపిల్ల కాబట్టి ఏమీ చెప్పలేక పోతోంది. స్కూల్లో ఇవేమీ చెప్పకుండా యాక్సిడెంట్ అని చెప్పండి. అమ్మ అని బాగా ఏడుస్తోంది." అంటూ విషయం వెంటనే చెప్పేసి గంగ కుటుంబం గురించి మమత అడిగింది. రామారావు సార్ తట్టుకోలేకపోయాడు. "ఇలా అయ్యిందేంటి డాక్టర్! గంగ తండ్రి లేని పిల్ల. చదువంటే ఇష్టం. బడిలో హుషారుగా ఉంటుంది. తనకిలా...!" అంటూ నివ్వెరపోయాడు. ఆయనే వెళ్లి గంగ తల్లికి విషయం చెప్పి తీసుకువచ్చారు. పిల్ల నిద్ర పోతోంది. గంగ పరిస్థితికి గుండెలు బాదుకుంటున్న తల్లిని తన రూమ్‌కి తీసుకెళ్ళి సముదాయించింది మమత. "ఇలాంటి పరిస్థితుల్లో తల్లి అండ చాలా అవసరం. మీరిక్కడే వుండి తగ్గాక ఇంటికి తీసుకెళ్ళండి. రోజూ "అమ్మా" అని ఏడుస్తోంది." అంది మమత.

"డాక్టరమ్మా! మేము పేదోళ్ళం. నా భర్త యాక్సిడెంటులో చనిపోయి రెండేళ్ళయ్యింది. నాకీ పిల్లతోపాటు ఇంకో పిల్లగాడున్నాడు. అమ్మానాన్నలతో ఈ పిల్లల్ని పెట్టుకుని రోజూ కూలీకి పోతూ కాలం గడుపుతున్నాం. ఈ పిల్ల స్కూలుకి పోతానని పేచీ పెడితే పంపుతున్నా. ఎవడిలాంటి పని చేసి అభం, శుభం తెలియని పిల్లకీ గతి పట్టించాడో! నేనిప్పుడీ పిల్లని తీసుకెళ్ళి ఏం చేయాలో?" అంటూ ఏడుస్తోంది. మమత ధైర్యం చెబుతూ "ఎవరికీ ఏమీ చెప్పొద్దు. దెబ్బలు తగిలితే ఆస్పత్రిలో చేర్పించామని, రెండు రోజులుండి తీసుకొస్తామని చెప్పండి. భయపడొద్దు అంది మమత. నా భర్త పోయాక పెద్దదాన్నని కూడా చూడకుండా నన్నే రకరకాలుగా మాటలతో వేధిస్తున్నారు. ఇప్పుడిక ఈ పిల్లకి కాపలాగా నేను ఇంట్లో వుంటే మాకు జరుగుబాటు కాదు. దీని తమ్ముడింకా చిన్నోడు. వాణ్ణెవరు సాకుతారు. నేనింటికెళ్ళి మా అమ్మానాన్నలతో మాట్లాడి రేపొస్తాను డాక్టరమ్మా." అంటూ కూతుర్ని ఓసారి చూసుకొని వెళ్ళిపోయిందా తల్లి.

మమత నాలుగయిదు రోజులు ఎదురు చూసింది. గంగను చూడటానికెవరూ రాలేదు. పేదరికం ఓ శాపం. ఆడపిల్ల బతుకు దుర్భరమని అర్థమైంది. ఓ నిశ్చయానికొచ్చింది. మామగారికి ఫోన్లో విషయం చెప్పి తను ఏం చేయదలచుకొన్నదీ చెప్పింది. 'సరేనమ్మా! రాఘవతో కూడా మాట్లాడోసారి..' అన్నారాయన. ఆ రాత్రికి రాఘవకి పాప విషయం చెప్పింది. తల్లి ఈ బిడ్డను తీసుకెళ్ళదు! ఇలాంటి దారుణానికి గురైన పాప చక్కని కుటుంబ వాతావరణంలో ఉంటే అన్నీ మరిచిపోయి మనుషుల్లో పడుతుంది. అందుకే మనింటికి తెచ్చుకుందాం! ఈ లోగా మనసు మారి తల్లి వస్తే ఆమెతో పంపుదాం! ఏమంటారు? అనడిగింది రాఘవని. "ఎందుకీ టెన్షన్స్ మనకి చెప్పు?. లేని పోని సమస్యలు" అని అన్నా మమత గురించి బాగా తెలుసు కనుక నవ్వుతూనే స్వాగతించాడు. వెంటనే గెస్ట్‌రూమ్‌ని బొమ్మలతో, రంగురంగు పోస్టర్లతో స్వయంగా అలంకరించింది. గంగ కోసం మంచి దుస్తుల్ని తెప్పించింది. గంగ పేరు మార్చి ఆకాంక్ష అని పేరు పెట్టింది. పెద్దావిడను పిలిచి "మీరు పాపకి సొంత అమ్మమ్మ! నేను అమ్మ, శ్రీకాంత్ అన్న ఇలా అంతా కలసి తనకి కుటుంబ బంధాన్ని అందిద్దాం. అప్పుడు పాపకి ఆ పాత పీడ తొలగి పోతుంది." అంది. అమ్మ రాదన్న విషయం అర్థమైన గంగ.. ఆకాంక్షగా మారి మమతకు కూతురైంది. మమత ఆకాంక్షకి అందరినీ

పరిచయం చేస్తోంది. ఫోటోలో ఉన్న పెద్దవారిని చూపించి నానమ్మ తాతగారని.. ఇదిగో శ్రీకాంత్ అన్న అంటూ ఫొటోల్లో వాళ్ళని పరిచయం చేసింది.

మమత హాస్పిటల్‌కి వెళ్లటానికి రెడీ అవుతుంటే రాఘవ వచ్చాడు నిద్ర లేచి. "ఏమిటి ఈ రోజు చాలా త్వరగా లేచినట్లున్నావ్? ఏంటి సంగతి? నీ ముద్దుల కూతురు వచ్చిందా ఏంటి?" అని ఆటపట్టిస్తున్నాడు రాఘవ. "మీరు కూడా ఆకాంక్షను పలకరించండి. మీకు కూడా చేరువ అవుతుంది. తనలో ఉన్న అభద్రతా భావాన్ని దూరం చేద్దాం." అంది మమత! "సరే డియర్! నీ ఆజ్ఞ" అంటూ 'ఆకాంక్షా!' అని పిలిచాడు. తన గదిలోంచి తొంగి చూసింది ఆకాంక్ష భయంగా!. "రామ్మా! నేను నీకు నాన్నను." అన్నాడు. భయం భయంగా దగ్గరకొచ్చింది. "నీకీ ఇల్లు బాగుందా? నీ రూమ్ నచ్చిందా? రేపు నీతో ఆడుకోటానికి శ్రీకాంత్ అన్న వస్తున్నాడు. ఈలోగా నీ గదిలో బొమ్మలున్నాయిగా వాటితో ఆడుకో." అంటూ నవ్వుతూ దగ్గరికి తీసుకున్నాడు.

మర్నాడు ఉదయం ఎక్స్‌కర్షన్ నుండి శ్రీకాంత్ వచ్చాడు. ఇంట్లో సందడిగా తిరుగుతున్న చిన్న పాపను గమనించాడు. ఈ లోగా మమత వచ్చి పలకరించింది. "ఏరా శ్రీకాంత్? నీ ట్రిప్ బాగుందా? వరంగల్‌లో నేచెప్పినవన్నీ చూశావా." అని అడిగింది. "అమ్మా! నువ్వు చెప్పినట్టే అన్నీ చాలా బాగున్నాయి. వేయి స్తంభాల మంటపం, నంది చాలా బాగున్నాయమ్మా!" అంటూ గబగబా చాలా విశేషాలు చెప్పాలనే ప్రయత్నంలో తన పక్కనే నిలబడ్డ ఆకాంక్షను చూడలేదు. శ్రీకాంత్ అన్నా అంటూ ఆకాంక్ష పిలవగానే ఆమె వంక చూశాడు. "ఎవరమ్మా! ఈ పాప" అని అడిగాడు తల్లిని. "యాక్సిడెంటయ్యి మన హాస్పిటల్‌లో చేరింది. వాళ్ళ వాళ్ళెవరూ ఇంత దాకా రాలేదు. చిన్న పాప కదా! అమ్మ కోసం బెంగ పెట్టుకుంటుందని మన ఇంటికి తీసుకొచ్చాము. వాళ్ళమ్మ వాళ్ళు వస్తే వెడుతుంది. లేకపోతే నీ చెల్లెలిగా ఇక్కడే వుండిపోతుంది. మరి ఈ రోజు నుండి ఆకాంక్షతో కలసిమెలసి ఉంటావు కదూ." అంది మమత. సరేనంటూ తలూపాడు శ్రీకాంత్.

శ్రీకాంత్ ఆకాంక్షతో చక్కగా ఆడుకుంటున్నాడు. ఎక్కాలూ, లెక్కలూ చెపుతున్నాడు. ఆకాంక్ష మనుషుల్లో పడింది. ఓ వారానికి మమత అత్తమామలొచ్చారు. ఇంట్లో ఆకాంక్ష సందడిగా తిరుగుతుంటే ముచ్చటేసింది వారికి. కొన్నిరోజులకు పిల్లలిద్దర్నీ తీసుకుని పుట్టింటికెళ్ళింది. మమత తల్లిదండ్రులు సొంత మనుమరాలిగా ఆకాంక్షను దగ్గరకు తీసుకున్నారు. పట్టు పరికిణీ కొనిచ్చారు. ఆకాంక్ష వాటిని చూసి మురిసిపోయింది. 'అమ్మమ్మా! థ్యాంక్స్..' అంటూ ముద్దుపెట్టుకుంది.

ఒక్క నర్సింగ్ హోమ్‌లో ఉన్న నర్సులకి తప్పితే ఇంకెవరికీ పాప గురించి పూర్తి వివరాలు చెప్పలేదు. పెద్దదవుతున్న ఆకాంక్షను చూసి ఇంట్లో వారు మురిసిపోతుంటే, రాఘవ మాత్రం గతం వల్ల ఆకాంక్ష పెళ్లి విషయం ఏమౌతుందోనన్న ఆలోచనలో పడ్డాడు. మమత అతనికి ధైర్యం చెప్పింది. "నేనెలా మిమ్మల్ని చేసుకున్నానో ఆకాంక్ష కూడా నాలాగే, దాన్ని వెతుక్కుంటూ వచ్చిన వ్యక్తిని చేసుకుంటుంది. ఏం భయపడనక్కర్లేదు." అని నమ్మకమిచ్చింది మమత.

♦♦♦

దాదాపు పదిహేనేళ్ల తర్వాత. మమత ఇంట్లో ఇద్దరు కాదు ముగ్గురు డాక్టర్లు ఉన్నారు. ఎమ్‌బిబిఎస్ పూర్తయ్యాక పై చదువులకు ఆకాంక్ష, శ్రీకాంత్ విదేశాలకు వెళ్ళారు. శ్రీకాంత్ అక్కడే జాబ్ సాధించి స్థిరపడ్డాడు. మమతకు దూరంగా ఉండలేక ఆకాంక్ష ఇక్కడే ప్రాక్టీస్ చేసేందుకు వస్తోంది. ఆమె విదేశాల నుండి వచ్చే ముందు రామారావు మాస్టారుకి మమత ఓసారి రావాల్సిందిగా కబురు చేసింది. వాళ్ళ అమ్మ, తమ్ముడు ఎక్కడున్నారో తెలుసుకుని చెప్పమంది. తమ్ముడు మెకానిక్ పని చేస్తున్నాడని, తల్లి ఏ పనికీ వెళ్ళలేక ఇంట్లోనే ఉంటోందని చెప్పారాయన. ఓ రోజు రామారావు సార్‌ని వెంటబెట్టుకుని వాళ్ళింటికెళ్ళింది. తనను తాను పరిచయం చేసుకుంది. గంగ గుర్తుందా? అంటూ అడిగింది. తల్లి ఏడవటం మొదలు పెట్టింది. డాక్టర్ ఆకాంక్షగా మారిన గంగ ఫొటోల్ని తన సెల్‌లో చూపించింది. మా గంగేనా అంటూ ఆశ్చర్యపోయింది తల్లి. "మీ గంగ కాదు, మన ఆకాంక్ష, పెద్ద డాక్టరమ్మ అయింది. విదేశాల్లో చదువుకుని తిరిగి వస్తోంది. మిమ్మల్ని ఇప్పుడు చూస్తే గుర్తుపట్టక పోవచ్చు. మళ్లీ మీరంతా కలవాలి అంటే నేను చెప్పినట్టు చేస్తారా? మీ అబ్బాయి పది పాసయ్యాడు కదా! మా ఆస్పత్రిలో కాంపౌండర్ పని నేర్పిస్తాను. మీరూ మా ఇంట్లోనే ఉండొచ్చు. గతాన్ని మరచిపోయి ఆకాంక్ష గొప్పదనాన్ని పనితనాన్ని చూడవచ్చు. మిమ్మల్ని గుర్తు పట్టి మీకు దగ్గరైతే మరీ మంచిది. పాపకి ఇద్దరమ్మలుంటారు. మరి నాతో వస్తారా మీరు? మీ పాప ఓ నెలలో ఇక్కడకొచ్చేస్తుంది." అంది మమత నెమ్మదిగా నచ్చచెప్పినట్లు. అంత సంతోషకరమైన మాటలు విన్నాక కన్నతల్లి ఆనందంతో ఏం మాట్లాడలేకపోయింది. సరేనంటూ బట్టలు సర్దుకుని ఇద్దరూ కారెక్కారు. గంగ తల్లి ఆయాగా ఆస్పత్రిలోనే వుంటానంది. అనుక్షణం కూతురిని చూసుకోవచ్చనిపించి. సరేనంది మమత.

వాళ్ళిద్దరూ ఆకాంక్ష రాక కోసం బాగా ఎదురుచూస్తున్నారు. ఆ రోజు రానే వచ్చింది. కార్లో ఇంటికెళ్ళకుండా నేరుగా హాస్పిటల్‌కి వచ్చింది ఆకాంక్ష. పాత నర్సులను గుర్తుపట్టింది. కొత్తగా వచ్చిన కాంపౌండర్, ఆయాలను గుర్తుపట్టలేదు. కొత్తగా వచ్చి చేరారనుకుంది. ఆకాంక్షను కళ్ళార్పకుండా అలాగే చూస్తోంది కన్నతల్లి. "ఎంత బాగుంది తన గంగ.. ఎంత భయపడ్డాను అప్పట్లో. కానీ ఇక్కడ ఈ డాక్టరమ్మ పెంపకంలో ఎంత గొప్పదైంది. 'గంగ'గా లోకం దృష్టిలో దాన్ని ప్రమాదంలో చంపేశాను. ఇప్పుడు ఆకాంక్షగా మమతమ్మ అంత గొప్ప డాక్టరు కాబోతోంది." అనుకుంది. కన్నుల పంటలాగా కనిపిస్తున్న కూతుర్ని చూసిన తల్లి ఆలోచనలు తరగటంలేదు.

ఓ రోజు కాన్పు కేసు వచ్చింది. మమత, ఆకాంక్ష ఇద్దరూ ఆపరేషన్ థియేటర్‌లో ఉన్నారు. ఏదో అవసరమై ఆకాంక్ష 'ఆయా' అంటూ



కేకపెట్టింది. ఆయమ్మా అని పిలువు త్వరగా పలుకుతుందని మమత నవ్వింది.

♦♦♦

భలే బొజ్జుగా ఉంది కదమ్మా అని అప్పుడే పుట్టిన బిడ్డను తలచుకుని మురిసిపోతూ చెబుతోంది ఆ సాయంకాలం మమతతో ఆకాంక్ష. ఈలోగా ఆయమ్మ ఏదో పని మీద వారి రూమ్‌లోకి వచ్చింది. అప్పుడు ఆకాంక్షకు పరిచయం చేసినట్టు "ఆయమ్మ కూతురు యాక్సిడెంట్‌లో చనిపోయింది. అప్పటి నుంచి నీలాంటి వాళ్లలో తన కూతుర్ని చూసుకుంటోంది. అందుకే ఆయా అని కాకుండా ఆయమ్మ అని పొద్దున్న పిలవమన్నాను." అంటుండగా ఆయమ్మ కల్పించుకుని "అమ్మా అని పిలిస్తే అంతకంటే ఏం వద్దొమ్మా.." అని కన్నీళ్లు పెట్టుకుంది.

✦

మామిడి, రొయ్యల పచ్చడి

కావాల్సిన పదార్థాలు

రొయ్యలు - 2 కిలోలు
పచ్చిమిర్చి - 1 1/2 కేజి
రిఫైండ్ ఆయిల్ - 450 ఎంఎల్
ఆవాలు - 2 టీ స్పూన్లు
మెంతులు - 2 టీ స్పూన్లు
ఉల్లిపాయలు - 800 గ్రాములు
వెల్లుల్లి రేకలు - 150 గ్రాములు
కరివేపాకు - 10 రెబ్బలు
పచ్చిమిర్చి - 8
అల్లం వెల్లుల్లి పేస్ట్- 12 టీ స్పూన్లు
పసుపు - 1 టీ స్పూను
కారం - 80 గ్రాములు
ధనియాల పొడి - 80 గ్రాములు
కొబ్బరి పేస్ట్- 400 గ్రాములు
టమేటో ప్యూరి- 800 గ్రాములు
ఉప్పు- తగినంత
కొత్తిమీర- 80 గ్రాములు
నానబెట్టేందుకు
నిమ్మరసం - 4 టీ స్పూన్లు
పసుపు - 1/2 టీ స్పూను
ఉప్పు - తగినంత

తయారుచేసే విధానం

నిమ్మరసం, పసుపు, ఉప్పు రొయ్యలకు పట్టించి నానబెట్టాలి. మామిడికాయల్ని రొయ్యలకంటే చిన్న ముక్కలుగా కోసి పక్కన పెట్టుకోవాలి. బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు, ఉల్లి వెల్లుల్లి ముక్కలు, మెంతులు, కరివేపాకు, పచ్చిమిర్చి వేసి వేయించాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, కారం, ధనియాల పొడి వేసి ఇంకొంతసేపు వుంచాలి. తర్వాత కొబ్బరిపేస్ట్, టమేటో ప్యూరి వేసి ఉడకనివ్వాలి. అందులో నీరు, ఉప్పు వేసి కలపాలి. ఇప్పుడు మామిడికాయ ముక్కలు వేసి గ్రేవి చిక్కబడే వరకు వుంచి నానబెట్టిన రొయ్యల్ని వేసి కలుపుకోవాలి. స్టౌపై నుంచి దించేసిన తర్వాత కొత్తిమీరతో అలంకరించుకోవాలి.

చికెన్ పచ్చడి

కావాల్సిన పదార్థాలు

బోన్‌లెస్ చికెన్- 1/2 కెజి
గరం మసాలా పొడికి
(యాలకులు, దాల్చిన చెక్క, మిరియాలు, లవంగాలు)- 2 టేబుల్ స్పూన్లు
అల్లం వెల్లుల్లి పేస్టు- 50 గ్రాములు
ధనియాల పొడి- 100 గ్రాములు
జీలకర్ర పొడి- 30 గ్రాములు
పొడి కారం - 100 గ్రాములు
నిమ్మకాయలు - 6
నూనె - 1/4 కిలో
ఉప్పు- తగినంత

తయారుచేసే విధానం

ముందుగా చికెన్‌ను చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. వీటిని 8 నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఒక పాన్‌లో నూనె వేసి వేడిచేయాలి. అందులో ఉడికించిన చికెన్ ముక్కలు వేసి కొన్ని నిమిషాలు వేయించాలి. ఒక గిన్నెలో గరం మసాలా పొడి, వేయించిన చికెన్ ముక్కలు, నిమ్మరసం, ధనియాల పొడి, కారం, ఉప్పు, వెల్లుల్లి, అల్లం పేస్ట్ వేసి ముక్కలు వేయించగా మిగిలిన నూనె పోసి కలుపుకోవాలి. చల్లారాక సీసాలో పెట్టి మూతపెట్టాలి.

చేపల పచ్చడి



కావాల్సిన పదార్థాలు

చేపల ముక్కలు - 1 కిలో
నూనె - 2 కప్పులు
ఉల్లిపాయలు - 1 1/2 కిలో
అల్లం తరుగు - 100 గ్రాములు
వెల్లుల్లి - 200 గ్రాములు
పచ్చిమిర్చి - 15
కారం - 2 టేబుల్ స్పూన్లు
ధనియాల పొడి - 6 టేబుల్ స్పూన్లు
మిరియాల పొడి- 2 టేబుల్ స్పూన్లు
మెంతి పిండి - 1 టీ స్పూన్
వైట్ వెనిగర్ - 1 లీటరు
వెల్లుల్లి రేకలు- 3
ముక్కలు నానబెట్టుకోడానికి కావాల్సినవి
పసుపు- 1టీ స్పూన్
కారం- 1 టేబుల్ స్పూన్
ఉప్పు- తగినంత

తయారుచేసే విధానం

ముందుగా చేపలను అరంగుళం ముక్కలుగా కట్ చేసుకోవాలి. పసుపు, కారం,ఉప్పు, ముక్కలకు పట్టించి పక్కన పెట్టుకోవాలి. ఉల్లిపాయ ముక్కల్ని నూనెలో రంగుమారే వరకు వేయించి పక్కన పెట్టుకోవాలి. అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి ముక్కలను పొడిపొడిగా అయ్యేంత వరకు వేయించుకోవాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేసి చేపముక్కలని ఓ మాదిరిగా వేయించి ఒక ప్లేట్‌లోకి తీసుకోవాలి. మిగిలిన నూనెలో కారం, ధనియాల పొడి, మిరియాల పొడి, మెంతి పిండి వేసి వేగిన తర్వాత ముందుగా వేయించుకున్న చేపలు వేసి మరికొంత సేపు వేయించాలి. అందులో వేయించిన ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి ముక్కలు వేసి కలియబెట్టాలి. ఈ మిశ్రమానికి వెనిగర్ చేర్చి సన్నని సెగపై ఉడకనిచ్చి తగినంత ఉప్పువేసి కలపాలి. చేపల ముక్కలు చెదరకుండా చిక్కబడే వరకు ఉంచి స్టౌ కట్టేయాలి. మూత పెట్టి కొంతసేపు అలాగే ఉంచాలి. చల్లారాక పచ్చడిని గాజు సీసాలోకి తీసుకుని పైన వెల్లుల్లి రేకలు వేసుకోవాలి. వారం రోజులు బయటే వుంచి తర్వాత ఫ్రిజ్‌లో పెట్టుకుంటే పచ్చడి రుచిగా వుంటుంది.

పది తేడాలు గుర్తించండి

పిల్లలు ఈ చిత్రంలోని రెండు బొమ్మలు ఒకేలా ఉన్నాయి. అయితే ఇందులో పది తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించి సున్నా చుట్టండి.

బాల నేస్తాలు

సుడోకు

ఒకటి నుంచి తొమ్మిది అంకెలను ఉపయోగించి పూరించండి

5	3			7				
6			1	9	5			
	9	8					6	
8				6				3
4			8		3			1
7				2				6
	6					2	8	
			4	1	9			5
				8			7	9

ఫింగర్ పపెట్

చేతి వేళ్ళకు రకరకాల బొమ్మలను తగిలించుకుని ఫ్రెండ్స్‌కి చూపించి 'నా వేలు ఏమైందో కనుక్కో?' అంటూ కొంటె ప్రశ్నలు వేస్తుంటారు కదూ. అయితే ఆ బొమ్మలని అమ్మ నాన్నలు ఇచ్చిన పాకెట్ మనీతో కొనేసుంటారు! పాకెట్ మనీతో పని లేకుండా మన ఇంట్లో దొరికే వస్తువులతో ఈ పపెట్‌లను ఎలా తయారు చేసుకోవచ్చో చెప్పుకుందాం.

కావాల్సినవి:

రంగు పెన్సిళ్ళు/ మార్కర్, పెన్సిల్, నలుపు రంగు కన్‌స్ట్రక్షన్ పేపర్, స్టాప్లర్ (పుస్తకాల అట్టలకు పిన్నులు కొట్టేది), కత్తెర, గమ్

తయారుచేసే విధానం:

ముందుగా ఒక తెల్లటి పేపర్ తీసుకుని మీకు నచ్చిన బొమ్మలను ఆ పేపర్‌పై గీసుకోవాలి. తర్వాత రంగు పెన్సిల్‌తో ఆ బొమ్మకు రంగులు అద్దాలి. రంగులు అద్దిన ఆ బొమ్మని జాగ్రత్తగా కత్తిరించుకోవాలి. కత్తిరించిన భాగాన్ని కన్‌స్ట్రక్షన్ పేపర్ పై వుంచి చివర్లు పాడవకుండా జాగ్రత్తగా కత్తిరించాలి. ఇప్పుడు మీరు రంగులద్దిన భాగాన్ని కత్తిరించిన కన్‌స్ట్రక్షన్ పేపర్ బొమ్మని గమ్‌తో అతికించాలి. ఇప్పుడు బొమ్మ చివర్లని రింగ్ ఆకారంలో వెనక్కి మడిచి స్టాప్లర్‌తో పిన్ చేసుకోవాలి. అంతే! ఇక మీ వేలు దూర్చేందుకు పపెట్ సిద్ధమైనట్టే. ఇలా మీకు నచ్చినన్ని పపెట్లను తయారు చేసుకోవచ్చు.



ఎవరి నీడ ఏదో

పిల్లలూ... ఇక్కడ సముద్రంలో నివసించే ప్రాణులు ఎనిమిది వున్నాయి. వాటి కిందే నీడలు కూడా వున్నాయి. ఇంతకీ ఎవరి నీడ ఏదో గుర్తించండి.



బొమ్మ గీద్దామా

ఆర్టిస్టు అంకుల్ ఈ వారం కోడి బొమ్మలా గీయాలో నేర్పిస్తాడట. మరి రెడీనా!



బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేను లిటిల్ సోల్జర్స్‌లో తెలుగు సినిమా లో నటించాను. ఇది నా చిన్ననాటి ఫోటో. ఇంతకీ నేనెవరో గుర్తించండి?

MOTHER	UNCLE
FATHER	GRANDMA
SISTER	GRANDPA
BROTHER	FRIEND
COUSIN	NEIGHBOR
AUNT	CLASSMATE

చుట్టాలు ఎక్కడున్నారో!

బుజ్జి పుట్టినరోజుకి చాలా మంది చుట్టాలొచ్చారు. కానీ ఎక్కడో కూర్చుని కబుర్లలో పడ్డారు. కేక్ కత్తిరించే టైమయింది. ఇంతకీ వాళ్లంతా ఎక్కడున్నారో కనిపెట్టండే. కేకులో నిలువుగా, అడ్డంగా వంకరగా చూడండి కనిపిస్తారు.



సుడోకు జవాబు :

5	3	4	6	7	8	9	1	2
6	7	2	1	9	5	3	4	8
1	9	8	3	4	2	5	6	7
8	5	9	7	6	1	4	2	3
4	2	6	8	5	3	7	9	1
7	1	3	9	2	4	8	5	6
9	6	1	5	3	7	2	8	4
2	8	7	4	1	9	6	3	5
3	4	5	2	8	6	1	7	9

పదవికాసం - 2

కూర్పు: టి.డి. ప్రసాద్

1		2	3	4	●	5	6	●	7
	●	8			●	●	9	10	
11	12		●	13	14	15	●	16	
17		●	18	●	19		20		●
21		22		●	23			●	24
	●		●	25			●	26	
●	27		●	28		●	29		●
30		●	31		●	32		●	33
	●	34			●		●	35	
●	36				●	37			

ఆధారాలు

అడ్డం

1. ఇలా అనగానే సందరయ్య అని తెలిసిపోతుంది (5)
6. మే నెలే మరోసారి (2)
8. శోకించే, దు:ఖించే (3)
9. కవి రాసిన రచన (3)
11. రద్దయిన గ్రామ వ్యవస్థలో లెక్కలు రాసే వ్యక్తి (3)
13. మా అమ్మ తమ్ముడు 1,2,4 (3)
16. వ్రతం (2)
17. విసవిసాలో చివరలేని తొలి సగం (2)
19. పూదేనె (4)
21. మనస్సు, ఒక సరస్సు (4)
23. రాజులకు రాజు, చక్రవర్తి (3)
25. కాగితపు సంచి (3)
26. శిరస్సు (2)
27. కోపం (2)
28. భర్త, పెనిమిటి (2)
29. కురులతో వేసేది. జడ కాదు (2)
30. సూర్యుడు (2)
31. క్రీడ (2)
32. పాకిస్తాన్ జాతిపిత (2)
34. సౌఖ్యము (3)
35. కాలు చాచి వేసే అడుగు (2)
36. పుత్రులు (4)
37. సుదీర్ఘ కాలం జక్కన్న చెక్కిన చిత్రం (4)

నిలువు

1. కమల్, అమల నటించిన సైగల సినిమా (6)
2. సైంధవం, ఉప్పు (3)
3. విరోధం (2)
4. ఎగబాకిన మాచెల్లి (3)
6. మేమే అని అరిచే జంతువు (2)
7. మేలు చేయునది (3)
10. తెలుగు ఎంటర్‌టైన్‌మెంట్ (3)
12. నాలుక (3)
14. ఇంద్రుని పట్టణం, రాష్ట్ర రాజధాని (5)
15. వివాదం (4)
18. సర్పం (2)
20. 'రంజు భలే రామచిలుక' పాట మొదలు (2)
22. సన్యసించిన వాడు (3)
24. రాయి (2)
25. మోసాలు, బూటకాలు (5)
26. పొడి కాదు (2)
27. మనసు లేని 'మనసు కవి' (2)
29. వంశీ పైడిపల్లి ఇలియానా, ప్రభాస్ కాంబినేషన్‌లో వచ్చిన సినిమా (2)
30. గాయమైతే వచ్చేది (2)
31. చివర, అంత్యము (3)
32. పైకేగిన బాపూజి (3)
33. పొలం దున్నేది (3)
34. సుమను పిలవండి (2)
35. అమ్మ (2)

గత వారం సమాధానాలు

(పదవికాసం - 1)

1 స	2 మీ	క	3 ర	ణ	●	4 త	బ	5 ల	●
6 మ	నం	●	వ	●	7 సౌ	మ్యు	●	8 కా	9 మా
రం	●	10 తా	ళి	●	11 రం	డి	●	12 రం	గా
●	13 సీ	లు	●	14 స	గం	●	15 ఎ	●	ణి
16 చీ	మ	●	17 చి	త్త	●	18 క	లు	గు	●
ర	●	19 క	లు	వ	●	20 పా	క	●	21 గ
●	22 అ	ట	క	●	23 క	ల	●	24 య	●
●	క	●	25 లు	26 ము	ళి	ము	●	27 వ	28 పా
29 ని	టా	30 రు	●	31 ఠా	ణా	●	32 అ	ని	త
పు	●	33 చి	మ్ని	●	34 ప్ర	త్యే	హా	క	దా



శిశిరంలో సూరీడి మేళా

ఆరావళి పర్వతాల తెరచాటున మనిషి సృష్టించుకున్న సూర్యుడి చెరువు సూరజ్ కుండ్. ఢిల్లీకి ఆనుకుని హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఉండే ఈ సరస్సున ప్రతి ఫిబ్రవరి తొలి పక్షంలో దేశ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళలు, హస్తకళలు పొద్దు పొడుస్తాయి. ప్రపంచంలోనే అతి పెద్ద క్రాఫ్ట్ మేళాగా పిలిచే సూరజ్ కుండ్ అంతర్జాతీయ హస్త కళల మేళా 30వ సీజన్ వచ్చేసింది. ఈ సీజన్‌లో రుతువుల పేర్ల మీదే 5 ప్రత్యేక విభాగాల్ని ఏర్పాటు చేశారు. 864 దేశవాళీ రెల్లు గడ్డి, మట్టి గోడల ఇంటి నమూనాలో మన దేశంలోని అన్ని రాష్ట్రాలే కాదు సుమారు 20 దేశాలకు చెందిన హస్త కళల స్టాళ్లు కనువిందు చేస్తున్నాయి. దేశంలోని ఓ రాష్ట్రాన్ని ఎంచుకుని దాని సంస్కృతి, సంప్రదాయాల్ని 40 ఎకరాల్లో ఉండే మేళా గ్రామమంతటా ప్రతిబింబిస్తారు. ఈసారి తెలంగాణాను నేపథ్య రాష్ట్రంగా ఎంచుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను 1999, 2007, 2011లో ప్రతిబింబించారు. అంతర్జాతీయ పర్యాటక కేలండర్‌లోను నమోదైన ఈ సంబరాన్ని పది లక్షల మంది సందర్శిస్తారని అంచనా. వారిలో వేలాది మంది విదేశీ పర్యాటకులుంటారు. ప్రదర్శనలు, కార్యక్రమాలు దేశీయతను కళ్లకు కడతాయి. దేశమంతా ఇక్కడో గ్రామంగా రూపుదిద్దుకోవడంతో విదేశీ పర్యాటకులకు ఓ టూర్ కలిసి వచ్చినట్టే భావిస్తారు. ○

కాగితం విగ్గు

తెల్లగా, లేత పసిడి రంగులో ధగధగలాడిపోయే జుత్తంటే యూరప్‌లో క్రేజ్. దానికి బ్లాండ్ అని పేరు. ఆ జుత్తున్న అందగత్తెల్ని టక్కున పిలిచేది ఆ పేరుతోనే. అదే వారికి సెలబ్రెటీ స్టేటస్ కూడా. ఇప్పుడేమో కానీ మూడు దశాబ్దాల క్రితం బ్లాండ్ జుత్తు అంటే ఇప్పటి కంటే కొన్ని రెట్ల క్రేజ్ యూరప్‌లో. ఎంతంటే బ్లాండ్ జుత్తుతో చేసిన భారీ విగ్గుల్ని ఫ్యాషన్‌కే కాదు రాణులు, రాజులు, అధికారులు ఇలా ఎలైట్ క్లాసంతా కూడా వాటిని నెత్తిన పెట్టుకుని మురిసిపోయేది. విగ్గుల తీరులో ఏ కాస్త లోపాన్ని లైట్‌గా తీసుకునేది కాదు. వాటికే ప్రత్యేక డిజైనర్లుండేవాళ్లు. ముఖవర్చస్సు కన్నా విగ్గు సైజు, ఆకారాన్నే అందానికి కొలమానంగా తీసుకునేవారు. పశ్చిమ యూరప్‌లో వెల్లివిరిసిన కళావిప్లవ కాలం... క్రీ.శ. 1600-1750 మధ్య కాలాన్ని బరోక్ యుగంగా పిలుస్తారు. ఈ కాలంలో శిల్పం నుంచి మాస్కుల వరకు ప్రతి కళలోను కొత్త పుంతలు తొక్కిందీ శైలి. మిగతావి కొనసాగుతూనే ఉన్నా ఆ కాలానికే అన్నట్టుగా అప్పటి విగ్గులే ఆ రోజులకు సింబాలిక్. వీటిపైనే అస్యా కోజినా మనసు పెట్టేసుకుంది. వాటిని మళ్లీ శిరసున పెట్టుకుని ఆరాధించేలా లేటెస్ట్ ఫ్యాషన్ ట్రెండ్ చేసేయాలనేది ఆమె కోరిక. ○

Check List

Book Number	KNSR02B108	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mouni	Cutting By	Mounika
Scanned By	Shameera	Pages	29